ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శుక్రవారం, 12 ఏప్రిల్ 2024






ప్రార్థనలతో రంజాన్

● భక్తిశ్రద్ధలతో జరుపుకున్న ముస్లింలు ● ఈద్గాలు, మసీదులలో సందడి

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 11 : జిల్లా వ్యాప్తంగా ముస్లింలు రంజాన్ పండుగను గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ పవిత్ర మాసంలో 30 రోజులు ఉపవాస దీక్ష పాటించిన దైవ విశ్వాసకులు, అందుకు సహకరించినందుకు అల్లాహ్‌కి కృతజ్ఞతలు తెలుపుతూ ప్రార్థనలు చేశారు. ఇస్లాం సంప్రదాయ దుస్తులతో చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ మసీదులు, ఈద్గాలకు వెళ్లి సామూహికంగా ప్రార్థనలు జరిపారు. ఇస్లాం విశిష్టతను, ముస్లింలు ఆచరించాల్సిన సన్మార్గాలను మత పెద్దలు వివరించారు. ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మసీదులు, ఈద్గాలలో పెద్ద ఎత్తున ప్రార్థనలు జరిగాయి. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుని, కుటుంబ సభ్యులు, బంధువులతో సందడి చేశారు.





నెల్లూరులోని బారాషహీద్‌దర్గాలో ముస్లింలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఇమాం అబూబకర్

భలే చిత్రం.. రాజకీయ సమూహం!

వీరంతా ప్రధాన పార్టీల తరఫున ఎన్నికల సమరంలో తలపడుతున్న అభ్యర్థులు. గెలుపే లక్ష్యంగా ప్రత్యర్థులపై నిత్యం విమర్శనాస్త్రాలు సంధించే నాయకులు రంజాన్ పండుగపూట అంతా ఒక చోటకు చేరారు. గురువారం నెల్లూరులోని బారాషహీద్ దర్గాలో ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేసి, 'ఈద్ ముబారక్' అంటూ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి (నెల్లూరు ఎంపీ), పొంగూరు నారాయణ (నెల్లూరు సిటీ), కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి (నెల్లూరు రూరల్), టీడీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, వైసీపీ అభ్యర్థులు విజయసాయిరెడ్డి (నెల్లూరు ఎంపీ), అహ్మద్ ఖలీల్ (నెల్లూరు సిటీ), ఆదాల ప్రభాకరరెడ్డి (నెల్లూరు రూరల్), రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి (కావలి), వైసీపీ జిల్లా అధ్యక్షుడు పర్వతనేని చంద్రశేఖరరెడ్డి తదితరులు ప్రార్థనలో పాల్గొన్నారు.



ఉదయగిరిలో ప్రార్థనలు



అల్లూరులో..



సంగంలో...



పొదలకూరులో..



కావలిలో చిన్నారుల సందడి

వచ్చిన ఫిర్యాదులు ఏంటి..

ఎలా పరిష్కరించారు!?

● రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మీనా ఆరా
● నెల్లూరులో కమాండ్ కంట్రోల్ సెంటర్ పరిశీలన
● ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం
● కోడ్ ఉల్లంఘనపై కఠినంగా ఉండాలని ఆదేశం

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 11 : సీ విజిల్ ఫిర్యాదులు, సోషల్ మీడియా వచ్చిన ఫిర్యాదులు ఏంటి? వాటిని ఎలా పరిష్కరించారంటూ జిల్లా అధికార యంత్రాంగాన్ని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా ప్రశ్నించారు. గురువారం నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎంసీసీ, సీ విజిల్, ఓటర్ హెల్ప్‌లైన్ 1950, ఎక్స్పెండిచర్ మానిటరింగ్ తదితర బృందాల పనితీరును ఆయన పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీ విజిల్ ఫిర్యాదులు, సోషల్ మీడియా ఫిర్యాదులను ఎలా పరిష్కరిస్తున్నారని అధికార యంత్రాంగాన్ని ప్రశ్నించారు. కోడ్ ఉల్లంఘనపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? సిబ్బందికి శిక్షణ పూర్తి చేశారా? తదితర విషయాలపైనా ఆరా తీశారు. ఎస్ఎంఎస్‌లు, వాట్సప్, సీ విజిల్, 1950 కాల్ సెంటర్లకు వస్తున్న ఫిర్యాదులపై సత్వరమే చర్యలు తీసుకొని పరిష్కరించడం పట్ల జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు.



కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీ విజిల్, ఎంసీసీలను పరిశీలిస్తున్న ముఖేష్‌కుమార్ మీనా

● స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగం

ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ ఈ నెల 18న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి పూర్తిస్థాయిలో ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. పారదర్శకంగా, స్వేచ్ఛగా ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు పక్కాగా చేపడుతున్నట్లు వెల్లండించారు. పైస్థాయి నుంచి కిందిస్థాయి అధికారుల వరకు సమన్వయంతో పనిచేసి ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరు బాగుందంటూ కితాబిచ్చారు. ఆ తరువాత అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో ప్రత్యేకంగా సమీక్షించిన ఆయన జిల్లాలో ఎన్నికల ప్రక్రియలో భాగమైన మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను పక్కాగా అమలు చేయాలని, కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగదు, మద్యం, ఇతర సామగ్రి అక్రమ తరలింపుపై నిఘా పెట్టాలన్నారు. ఎలాంటి ఘర్షణకు తావు లేకుండా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు చేపడుతున్న కార్యక్రమాలను కలెక్టర్ హరినారాయణన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీఈఓకు వివరించారు. ఈవీఎంలు పూర్తిస్థాయిలో ఉన్నాయని చెప్పారు.

● అవగాహన మస్కట్ ఆవిష్కరణ

ఓటు హక్కు ఆవశ్యకత, వినియోగం తెలుపుతూ ప్రత్యేకంగా రూపొందించిన అవగాహన మస్కట్‌ను సీఈఓ ముఖేష్ కుమార్ మీనా ఆవిష్కరించారు. 'ఓటు హక్కును వినియోగిద్దాం.. ప్రజాస్వామ్యాన్ని గెలిపిద్దాం, మే 13న ఓటు హక్కును వినియోగించుకుందాం!' వంటి నినాదాలతో రూపొందించిన మస్కట్ అందరినీ ఆకర్షించింది. ఆయన వెంట ఎస్పీ ఆరీఫ్ హఫీజ్, అదనపు ఎస్పీ సౌజన్య, కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్, నోడ్ అధికారులు శర్మద, ప్రసాదరావు, సదారావు, బాపిరెడ్డి తదితరులు ఉన్నారు.

డైట్

బిల్లులేవీ!?

● 8 నెలలుగా రోగుల ఆహార బిల్లుల పెండింగ్
● బిల్లులు పెడుతున్నా మంజూరు చేయని ప్రభుత్వం
● లబోదిబోమంటున్న కాంట్రాక్టర్లు

రూ.1.25 కోట్లకుపైగా బకాయిలు

ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు ఆహారం అందిస్తున్న కాంట్రాక్టర్లు బిల్లుల కోసం లబోదిబోమంటున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 8 నెలల బిల్లులు రూ.1.25 కోట్లు పెండింగ్ ఉండటంతో అవి ఎప్పుడు మంజూరవుతాయోనని ఆశగా ఎదురుచూస్తున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగినా అధికారుల పర్యవేక్షణ ఉండటంతో రోగులకు అందించే డైట్‌లో తేడా లేకుండా సరఫరా చేస్తున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా నెలవారీ ఖర్చులు పెరిగిపోతుండటంతో తెచ్చుకున్న అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నట్లు డైట్ కాంట్రాక్టర్లు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే రూ.1.25 కోట్ల బిల్లులు పెండింగ్ ఉండగా, ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయినప్పుడే చెల్లిస్తామని అధికారులు తేల్చి చెబుతున్నారు. కాగా, ప్రస్తుతం ఎన్నికల సీజన్ కావడం తో రాష్ట్రస్థాయి అధికారులంతా ఆ విధుల్లో నిమగ్నమై ఉన్నారు. దీంతో 'డైట్' ఫైలు పెండింగ్ లోనే ఉంటోంది.



నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 11 : నెల్లూరులోని ప్రభుత్వం జనరల్ ఆసుపత్రిలో ప్రతి రోజూ 500 మంది రోగులు ఉంటుండగా, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు పెడుతున్నారు. భోజనంలో అన్నం, సాంబారు, రసం, కూర, చట్నీ, కోడిగుడ్డు, అరటిపండు వడ్డిస్తున్నారు. అయితే మూడు పూటలా ఆహారం పంపిణీకి ప్రభుత్వం ఒక్కో రోగికి చెల్లించేది కేవలం రూ.72 మాత్రమే. రోగులకు ప్రతిరోజు క్రమం తప్పకుండా ఆహారం పెడుతున్నా ప్రభుత్వం ప్రతి నెలా డైట్ బిల్లులు చెల్లించడం లేదు. ఇప్పటికే 7 నెలలుగా రూ.90లక్షలకుపైగా పెండింగ్ ఉంది. ఇక ఆత్మకూరు జిల్లా ఆసుపత్రిలో 100 పడకలు ఉండగా, ప్రతిరోజూ 90 మంది వరకు రోగులకు ఆహారం పంపిణీ చేస్తున్నారు. ఇక్కడా 8 నెలలుగా బిల్లులు రావటం లేదు. రూ.15.12 లక్షల వరకు బకాయి ఉంది. ప్రతి రెండు నెలలకు బిల్లులు పెడుతున్నా ప్రభుత్వం నుంచి నయాపైసా విడుదల కాలేదు. కందుకూరు, కావలి ఏరియా ఆసుపత్రుల్లో ప్రతిరోజూ 42 మంది రోగుల వరకు చికిత్స పొందుతున్నారు. ఇక్కడ కూడా 8 నెలలుగా డైట్ బిల్లులు రూ.9 లక్షల వరకు బకాయి ఉంది. అలాగే జిల్లావ్యాప్తంగా 10 సామాజిక ఆరోగ్య కేంద్రాలలో ప్రతిరోజూ 60 మంది వరకు చికిత్సలు పొందుతుంటారు. వీరికి 11 నెలలుగా డైట్ బిల్లులు ఇవ్వలేదు. దాదాపు రూ.15 లక్షలకుపైగా కాంట్రాక్టర్లకు బకాయి ఉంది.

● వస్తాయో.. రావో!?

ప్రస్తుతం ఎన్నికలు ఉండటంతో ఇప్పట్లో డైట్ బిల్లులు ప్రభుత్వం చెల్లిస్తుందా అన్న అనుమానం కాంట్రాక్టర్లలో వ్యక్తమవుతోంది. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నిధులు కూడా ప్రభుత్వం వాడేసుకుంటోంది. దీంతో డైట్ నిధులు కూడా మోక్షం ఎప్పుడు వస్తుందో తెలియక డైట్ కాంట్రాక్టర్లు ఎదురు చూడక తప్పటం లేదు.

ఇప్పటికే అప్పుల పాలయ్యాం

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు పెడుతున్న ఆహారానికి సంబంధించి రూ.90 లక్షలకు పైగా బిల్లులు రావాల్సి ఉంది. అవి ఎప్పుడు వస్తాయే తెలియడం లేదు. ప్రతి నెల బిల్లులు మాత్రం పెడుతూనే ఉన్నాము. అప్పులు చేసి రోగులకు భోజనం వడ్డించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పుడు ఎన్నికలు జరుగుతున్నందున అధికారులంతా ఆ హడావుడిలో ఉన్నారు. ఇక మా బిల్లులు ఎప్పుడు ఇస్తారో!?

\- అస్రాఫ్, జీజీహెచ్ డైట్ కాంట్రాక్టర్



ప్రభుత్వం నిధులు విడుదల చేస్తేనే!?

డైట్ బిల్లుల నిధులు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. 8 నుంచి 11 నెలల వరకు డైట్ బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్ తిరుగుతున్నాడు. ఏది ఏమయినా ప్రభుత్వం నిధులు విడుదల చేయనిదే మేము ఏం చేయలేం.

\- డాక్టర్ రమేష్‌నాథ్, ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయకర్త

నేడు ఇంటర్ ఫలితాల విడుదల

● నేటి మధ్నాహ్నం ఆన్‌లైన్‌లో వెల్లడి
● విద్యార్థుల ఉత్కంఠకు తెర

నెల్లూరు (విద్య) ఏప్రిల్ 11 : ఇంటర్ పరీక్ష ఫలితాల విడుదలకు రంగం సిద్ధమైంది. ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలను శుక్రవారం విడుదల చేస్తున్నట్లు ఇంటర్‌బోర్డు ప్రకటించింది. ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి సౌరభ్‌గౌర్ తాడేపల్లిలోని ఇంటర్‌బోర్డు కార్యాలయంలో ఆన్‌లైన్‌లో ఫలితాలను విడుదల చేయనున్నా రు. మార్చి 1 నుంచి 20వతేదీ వరకు ఇంటటర్ పరీక్షలు జరగ్గా, ప్రథమ సంవత్సరం 26,419 మంది, ద్వితీయ సంవత్సరం 25,657 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆ తర్వాత అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ జవాబు పత్రాలను స్టోరేజీ పాయింట్‌లో భద్రపరిచి గత నెల 9 నుంచి మూల్యాంకనాన్ని ప్రారంభించా రు. నాలుగు విడతలుగా ఏప్రిల్ 6వతేదీ నాటికి స్పాట్‌ను పూర్తి చేశారు. స్పాట్‌లో విధులు నిర్వహించేందుకు అన్ని సబ్జెక్ట్‌లకు కలిపి 931 మంది అధ్యాపకులను నియమించారు. వేగవం తంగా స్పాట్‌ను పూర్తి చేసి జవాబు పత్రాలను విజయవాడలోని ఇంటర్‌బోర్డు కార్యాలయానికి తరలించారు. శుక్రవారం ఆన్‌లైన్‌లో ఫలితాలు విడుదల కానుండటంతో విద్యార్థుల్లో ఉత్కంఠ నెలకొంది. ఎవరికెన్ని మార్కులు వస్తాయోనని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు సైతం ఎవరికివారు లెక్కలు వేసుకుంటున్నారు. ఫలితాలకు సంబంధించిన వివరాలు https//results-bie.ap.giv.in వెబ్‌సైట్‌లో మధ్నాహ్నం నుంచే అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు.

ఉత్తర కాలువకు నీటి సరఫరా పెంపు

అనంత సాగరం : సోమశిల జలాశయం నుంచి ఉత్తర కాలువకు నీటి విడుదల పెంచారు. కాగా, డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా గురువారం ప్రాజెక్టులో 8.820 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ ఉత్తర కాలువకు 50 నుంచి 320 క్యూసెక్కులకు పెంచారు. డెల్టాకు 300, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

సౌత్‌మోపూరు రూపురేఖలు మార్చుతాం!

ప్రచారంలో టీడీపీ అభ్యర్థులు వీపీఆర్, కోటంరెడ్డి

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 11 : రాజకీయంగా చైతన్యం కలిగిన సౌత్‌మోపూరు గ్రామ రూపురేఖలను తమ పార్టీ అధికారంలోకి వచ్చాక మార్చి చూపిస్తామని టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా 37వ డివిజన్ మిలటరీ కాలనీ, మండలంలోని సౌత్‌మోపూరులో వారు పర్యటించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి, కోటంరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని ఆయన్ను చూసి పరిశ్రమలు ఏపీకి వస్తాయన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాజధాని లేని ఏపీని పరిపాలించిన జగన్ ప్రభుత్వం చరిత్రకెక్కిందంటూ దుయ్యబట్టారు. ఐదేళ్ల సుదీర్ఘ వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్ తరాలకు బాటలు వేయలేని జగన్ సర్కారు ప్రస్తుత ఎన్నికల్లో ఓట్ల కోసం వైసీపీ అభ్యర్థులు ప్రజల వద్దకు ఏ మొఖం పెట్టుకుని వెళ్తారని సూటిగా ప్రశ్నించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే టీడీపీ అభ్యర్థులు కావాలో అప్పుడప్పుడు యాత్రికుల్లా వచ్చి వెళ్లే వైసీపీ అభ్యర్థులు కావాలో తేల్చుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ముందుగా నెల్లూరులోని కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలలో మాజీ మేయర్ భానుశ్రీ, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, సీపీఐ సీనియర్ నేత పముజుల దశరథరామ య్య తదితరులు పాల్గొన్నారు.



సౌత్‌మోపూరులో ర్యాలీలో పాల్గొన్న వీపీఆర్, కోటంరెడ్డి



కందుకూరు జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘ నాయకులు

జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

నెల్లూరు (సిటీ), ఏప్రిల్ 11 : మహాత్మా జ్యోతి బాపూలే 198వ జయంతి సందర్భంగా గురువారం నగర కార్పొరేషన్ కార్యాలయంలోని ఆయన చిత్రపటానికి కలెక్టర్ ఎం హరినారాయణన్, కమిషనర్ వికాస్ మర్మత్‌లు నివాళులు అర్పించారు. సమాజం పట్ల ఆయన అనుసరించిన తీరు, దేశానికి అందించిన సందేశంపై కొనియాడారు. నేటి యువత జ్యోతిబాపూలేను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లావ్యాప్తంగా కావలి, కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి, అల్లూరు తదితర ప్రాంతాల్లోనూ జ్యోతిబాపూలేకు నివాళులర్పించారు.



జ్యోతిరావు పూలేకు నివాళి అర్పిస్తున్న కలెక్టర్ హరినారాయణన్, కమిషనరు వికాస్

మద్య రహిత ఎన్నికలే లక్ష్యం

● సెబ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు ● అధికారులకు దిశానిర్దేశం

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 11 : మద్య రహిత ఎన్నికలే లక్ష్యమని సెబ్ డిప్యూటీ కమిషనర్ కే.శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని సెబ్ కార్యా లయంలో జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంటు సూపరింటెండెంట్, ఇన్‌స్పెక్టర్లతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఎన్నికలలో ఓటర్లను మద్యం, సారాల ద్వారా ప్రలోభాలకు గురిచేయకుండా అడ్డుకోవాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకొని దాడులు ముమ్మరం చేయాలని ఆదేశించారు. కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి నాటు సారా కేంద్రాలపై దాడులు చేసి 11 కేసులు నమోదు చేశామని, 2100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. మద్యం అనధికార విక్రయాలపై 191 కేసులు నమోదు చేసి 194 మందిని అరెస్టు చేశామని చెప్పారు. వారి నుంచి 498 లీటర్ల మద్యం, 349 లీటర్ల బీరును స్వాధీనం చేసుకొన్నామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంటు సూపరింటెండెంటు బాబు శ్రీధర్, ఏఈఎస్ ప్రభాకర్, సెబ్ ఇనస్పెక్టర్లు ఆర్. విజయభాస్కర్, ఎస్.రాగమయి, యశోధర, శ్రీనివాసులు, వెంటకరావు, ప్రసాదరెడ్డిలు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న సెబ్ డీసీ శ్రీనివాసులు

● కొనసాగుతున్న తనిఖీలు

ఎన్నికల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా పోలీసుల తనిఖీలు కొనసాగుతున్నాయి. గురువారం జరిపిన తనిఖీల్లో దుత్తలూరు పరిధిలో రూ.1లక్ష, రాపూరు పరిధిలో 1,99,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరులోని చిన్నబజారు పోలీసు స్టేషన్ పరిధిలో 15, దుత్తలూరులో 15, దగదర్తిలో 16, ఉదయగిరిలో ఎనిమిది, సెబ్ ఆధ్వర్యంలో 124 మద్యం సీసాలను సీజ్ చేశారు.



రావణ వాహనంపై ఊరేగుతున్న, కామాక్షిదేవి సమేత సంగమేశ్వరుడు

లంకేశ్వరుడిపై సంగమేశ్వరుడి విహారం

సంగం, ఏప్రిల్ 11: స్థానిక సంగమేశ్వరాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అర్ధరాత్రి సంగమేశ్వరస్వామికి రావణసేవ గ్రామోత్సవం వైభవంగా జరిగింది. బోగనాథం శివప్రసాద్, శ్రీదేవి, శ్రీరాం హజరత్తయ్య, వసంతమ్మ, శ్రీరాం మస్తానయ్య, వెంకట సుజాత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అదేవిధంగా ఆలయంలో స్వామివారికి వెన్నా గౌరీ శంకర్‌రెడ్డి, ఉమా, అమ్మవారికి కే బుజ్జిరెడ్డి, పార్వతమ్మ దంపతులు పూలంగిసేవ ఉభయకర్తలుగా వ్యవహరించారు. శుక్రవారం ఉదయం రథోత్సవం జరుగుతుందని, భక్తులు పాల్గొనాలని ఆలయ ఈవో పెంచల ప్రసాద్ కోరారు.



శ్రీ మహా విష్ణువు మత్స్యావతార విగ్రహం వద్ద అర్చకులు, అధికారులు

వేదగిరిపై మత్స్య జయంతి

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 11 : వేదగిరి క్షేత్రంలో మత్స్య జయంతి సందర్భంగా మత్స్యావతారంలోని స్వామి వారి విగ్రహం వద్ద గురువారం పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో గిరికృష్ణ, ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు, అర్చక బృందం ప్రత్యేక పూజలు జరిపారు. కాగా మే 16 నుంచి 26వ తేదీ వరకు వేదగిరి క్షేత్రంలో జరిగే శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సంబంధించి పలు విభాగాలకు చెందిన టెండర్లను ఈ నెల 15వ తేదీన ఆలయ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు.

40 ఎకరాల గడ్డివామి దగ్ధం



దగ్ధమవుతున్న గడ్డి వాములు

ఆత్మకూరు, ఏప్రిల్ 11: మండలంలోని బండారుపల్లిలో ముగ్గురు రైతులకు చెందిన మూడు గడ్డివాములు దగ్ధమైన సంఘటన గురువారం మధ్యాహ్నం జరిగింది. సుమారు రూ. 4 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. వివరాల మేరకు గ్రామానికి చెందిన కుక్కపల్లి వెంకటేశ్వర్లు, పాడేటి వేణు, పాడేటి రవిలు ఇటీవల సుమారు 40 ఎకరాలకు చెందిన గడ్డి చుట్టలను ఒకే ప్రాంతంలో గడ్డివాములు ఏర్పాటు చేశారు. గురువారం మధ్యాహ్నం గడ్డి వాములకు మంటలు వ్యాపించి అగ్నిమాపక సిబ్బంది వచ్చేటప్పటికి దగ్ధమయ్యాయి. పాత కక్షలు మనస్సులో పెట్టుకుని గడ్డి వాములు తగులబెట్టారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

గుట్టు చప్పుడుకాకుండా పేర్లు తీసేశారు..!

కలువాయి, ఏప్రిల్ 11: కలువాయి మండలం చిన్నగోపవరంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు చెందిన జాబ్‌కార్డులలో చేర్చిన ఇతర ప్రాంతాలకు చెందిన వారి పేర్లు గుట్టు చప్పుడుకాకుండా అధికారులు తొలగించారు. గ్రామానికి చెందిన పలు జాబ్‌కార్డులలో పెద్ద ఎత్తున ఇతర ప్రాంతాలకు చెందినవారి పేర్లు చేర్పించి బోగస్ మస్టర్లు వేసుకుని నిధులు స్వాహా చేస్తున్నారని గ్రామస్థులు ఉపాధి అంబుడ్స్‌మన్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు అంబుడ్స్‌మన్ విచారణ చేపట్టారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన కుటుంబాల జాబ్‌కార్డులలో ఇతర ప్రాంతాలకు చెందిన వారి పేర్లు ఉన్నట్లు ఆయన ప్రాథమికంగా నిర్ధారించుకుని విచారణ జరుపుతున్నారు. ఈ అవినీతి బోగోతంపై పత్రికల్లో కథనాలు కూడా వచ్చాయి. ఈ సమయంలో జాబ్‌కార్డులలోని ఇతర ప్రాంతాలవారి పేర్లు తొలగించడంపై అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. దీనిపై ఉపాధి హామీ పథకం కలువాయి ఏపీవో మురళీని వివరణ కోరగా.. డ్వామా పీడీ ఆదేశాల మేరకు జాబ్‌కార్డులలో పేర్లు తొలగించినట్లు తెలిపారు. సుమారు 25 కార్డులలో పేర్లు తీసేసినట్లు వివరించారు.

'క్రోధి'లో కోపతాపాలకు దూరంగా ఉండండి



పురస్కార గ్రహీతలతో నిర్వాహకులు

నెల్లూరు(సాంస్కృతికం), ఏప్రిల్ 11: క్రోధి నామ సంవత్సరంలో అందరూ కోపతాపాలకు దూరంగా, ప్రేమ, ఆప్యాయతలతో మెలగాలని జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ సీహెచ్ ఉషాచరణ్ తెలిపారు. గురువారం టౌన్ హాలులో కోడూరు హరినారాయణ రెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉగాది పురస్కార వేడుకలు ఘనంగా జరిగాయి, ఈ సందర్భంగా ఉగాది సేవా అవార్డులను సురభి గాయత్రి, డాక్టర్ లలితాషిర్డీషా, జి.రాధారాణి, ఆచార్య సంధ్య, బైరిశెట్టి సుజన, చెన్నారెడ్డి శరణ్య రెడ్డి, చీదిరాల చెన్నయ్య, పులగర శోభన్‌బాబు, ఎంవీ. ప్రసన్నకుమార్ లకు హరినారాయణరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమాలను కే.మురళీమోహన్‌రాజు, డాక్టర్ కేనా రసింహా రెడ్డి, బత్తిన సాయికుమార్‌రెడ్డి, టి.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

వెంకటాచలం, ఏప్రిల్ 11: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గురువారం రాత్రి వెంకటాచలంలోని సర్వేపల్లి క్రాస్‌రోడ్డు సమీపంలో జెండావీధిలోని ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి షేక్ నసరుద్దీన్ ఇంటిలో విద్యుత్ తీగల్లో షార్ట్‌సర్క్యూట్ రావడంతో మంటలు వ్యాపించాయి. ఇంట్లో ఉన్న ఖరీదైన వస్తువులు, దుస్తులు, నగలు, వంట సామాగ్రి పూర్తిగా కాలిబూడిదయ్యాయి. నెల్లూరు నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	163
లేయర్ లైవ్	98
స్కిన్ చికెన్	284
స్కిన్‌లెస్	314
లేయర్	167

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6823
వెండి కిలో ధర	రూ. 85,200
వెండి ఒక గ్రాము	రూ. 87.20

శ్రీరాముడికి బిల్వార్చన

నెల్లూరు(సాంస్కృతికం), ఏప్రిల్ 11: నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో వసంత నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం ఉదయం స్వామివారికి తేనెతో అభిషేకం జరిగింది. అర్చకుడు నరేష్ ఆధ్వర్యంలో ఉదయం, సాయంత్రం మారేడు సమిధలతో హోమం, బిల్వార్చన జరిగాయి. సీతారాములు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



సంగం మండలం కొరిమెర్ల గ్రామానికి చెందిన సంపూర్ణమ్మకు నాలుగు పాడి గేదెలు ఉన్నాయి. నెల రోజుల కిందట వరకూ వాటి ద్వారా 16 లీటర్ల పాలు వచ్చేవి. ఇటీవల ఎండల ప్రభావం పెరగడంతో పాల ఉత్పత్తి 10 లీటర్లకు పడిపోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తోంది.



తరుణవాయి గ్రామానికి చెందిన దేగా క్రిష్టయ్యకు ఐదు పాడి గేదెలు ఉన్నాయి. పూటకు 10 లీటర్ల చొప్పున రెండు పూటలా 20 లీటర్ల పాలు ఇచ్చేవి. ఎండలు పెరగడంతోపాటు పచ్చి మేత లేక ఎండు గడ్డి వేస్తున్నారు. దీంతో రెండు పూటలా 12 లీటర్ల మాత్రమే ఇస్తున్నాయి. ఎండలు ఇంకా ఎక్కువైతే పాల దిగుబడి ఇంకా తగ్గిపోయే పరిస్థితి ఉంది.



అన్నారెడ్డిపాళెం గ్రామానికి చెందిన శ్రీనివాసులుకు రెండు గేదెలు ఉన్నాయి. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం కలిపి 8 లీటర్ల పాలు ఇచ్చేవి. ప్రస్తుతం పొలాల్లో మేత లేదు. ఎండలకు గేదెలను ఇంట్లోనే కట్టేసి మేత వేస్తున్నారు. కానీ పాల దిగుబడి బాగా తగ్గిపోయింది. ప్రభుత్వం స్పందించి రాయితీపై పశువుల దాణా అందచేయాలని శ్రీనివాసులు కోరుతున్నాడు.

తగ్గిన పాలధార!

ఎండల ప్రభావంతో పశుగ్రాసం కొరత

ఆందోళనలో పాడి రైతులు

సంగం, ఏప్రిల్ 11 : జిల్లాలో రోజురోజుకు ఎండలు మండిపోతున్నాయి. వడగాలులు వీస్తున్నాయి. ఆ ప్రభావం పాల దిగుబడిపై పడి ఉత్పత్తి తగ్గిపోయిందని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో వ్యవసాయానికి అనుబంధంగా ప్రతి పల్లెలో పాడి పరిశ్రమ ఉంది. పశుసంవర్థక శాఖ లెక్కల ప్రకారం జిల్లాలో లక్షల్లోనే పశుసంపద ఉంది. గేదె పాలకు వెన్న శాతాన్ని బట్టి పాల సేకరణ సంస్థలు లీటరుకు రూ.60 నుంచి 70 వరకు ఇస్తున్నాయి. గతంలో కొరిమెర్ల గ్రామంలో నాలుగు పాల సేకరణ కేంద్రాల ద్వారా సుమారు 400 లీటర్ల పాలు వచ్చేవి. ఆదికాస్తా ప్రస్తుతం 250 లీటర్లకు పడిపోయింది. అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి.



● తగ్గిన పాల దిగుబడి

ఎండల ప్రభావం పెరగడంతోపాటు వడగాలులు వీస్తున్నాయి. దీంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. పచ్చిక బయళ్లు ఎండిపోతున్నాయి. చూద్దామన్నా ఎక్కడా పచ్చిక కనిపించడం లేదు. కుంటలు, గుంటలు ఎండిపోతున్నాయి. పశువులకు పచ్చిక మేత కరువైంది. ఎండు గడ్డే దిక్కైయింది. దీంతో పాల దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. దీంతో ఆర్థికంగా తమకు కష్టాలు తప్పడం లేదని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● కొరవడిన ప్రభుత్వ సహకారం

గత ప్రభుత్వాలు ఎండాకాలం పాల దిగుబడి తగ్గి పోకుండా ముందు జాగ్రత్తగా సబ్సిడీలో పశువుల దాణా సరఫరా చేసేవారు. అంతేకాకుండా ఉపాధి హామి పథకంలో పచ్చిగడ్డి పోషణకు 90 శాతం రాయితీతో విత్తనాలు, కూలి కింద నగదు ఇచ్చే వారు. దీనితో రైతుల పొలాల్లో పచ్చిగడ్డి పెంచుకుని అటు పశువులకు మేతతోపాటు ఉపాధి పథకంలో కూలి పొందేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఉపాధి నిధులన్నీ సచివాలయ, ఆర్బీకే, హెల్త్ క్లీనిక్ వంటి భవన నిర్మాణాలకు కేటియించడంతో ప్రశుగ్రాసం పెంపకం వంటి పథకాలు చేపట్టడం లేదు. దీంతో పాడి రైతు వేసవిలో గడ్డు పరస్థితిని ఎదుర్కొంటున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

వేసవిలో ఎండ తీవ్రత నుంచి పశువుల సంరక్షణకు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి. ఉదయం 9లోపు, సాయంత్రం 4 గంటల తరువాత వాటిని మేతకు తీసుకెళ్లాలి. పశువుల్లో నీరు శాతం తగ్గడం వల్ల పాల దిగుబడి తగ్గుతుంది. వాటికి రెండు పూటలా అధికంగా నీరు ఇవ్వాలి. పచ్చిగడ్డి వేయాలి. ఎండుగడ్డిని నీటితో తడిపి ఇస్తే మంచిది. సంకరజాతి పశువులకు అధిక ఎండ తగలకుండా చూడాలని తెలిపారు.

- సురేష్, పశువైద్యాధికారి, సంగం

పల్లెల్లో రైతులు పంటల సాగుతోపాటు పాడిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. అయితే గత రెండేళ్లుగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో గుక్కెడు నీరు, కాసింత పచ్చిక కరువైంది. రెండేళ్లుగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో కరువు కరాళనృత్యం చేస్తోంది.

మూగ రోదన.. తీరని వేదన!

- వర్షాభావంతో నీరు, పచ్చిక కరువు
- జీవాలతో వలస వెళుతున్న యజమానులు



చుక్కనీరు లేని వెంకట్రావుపల్లి చెరువు



ఇతర ప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్న గడ్డి

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 11 : రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో పది మండలాలను కరువు మండలాలుగా ప్రకటిస్తే అందులో ఐదు ఉదయగిరి నియోజకవర్గ పరిధిలోనివే. ప్రధానంగా నీటి వనరులు అడుగంటిపోవడం, పచ్చిక కానరాకపోవడంతో మూగజీవాల యజమానుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. జలదంకి, కలిగిరి, కొండాపురం, వింజమూరు, దుత్తలూరు, వరికుంటపాడు, ఉదయగిరి, సీతారామపురం మండలాల్లో ఆవులు, గేదెలు, గొర్రెలు సుమారు 2.50 లక్షల వరకు ఉన్నాయి. వీటికి కనుచూపు మేరలో పచ్చిక కనిపించ డంలేదు. ఇళ్ల వద్ద కట్టేసి మేత వేయడం కష్టతరమైంది. గొర్రెలు, మేకలను అడవులకు తోలుకుపోతే పచ్చిక మేత దొరక్క, నీటి జాడ కనిపించక అల్లాడుతున్నాయి. రాబోయే రోజుల్లో మరింత గడ్డు పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని యజమానులు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు దాణా మంజూరు చేసేది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత దాణాను అరకొరగా పంపిణీ చేయడంతో రైతులు అవస్థలు పడుతున్నారు.

● తప్పని వలస

గొర్రెలు, మేకల కాపర్లు పలువురు తమ జీవాలను తీసుకొని నీరు, పచ్చిక దొరికే డెల్టా ప్రాంతానికి వలస వెళుతున్నారు. మరలా వర్షాలు సమృద్ధిగా కురిస్తే సొంత గ్రామాలకు వస్తారు. మేత, నీరు కరువవడంతో కొందరు యజమానులు మూగజీవాలను దళారులు అడిగిన కాడికి అమ్మేస్తున్నారు. వాటిపైనే జీవిస్తున్న మరికొందరు అమ్మకోలేక ఇతర ప్రాంతాలకు వెళ్లి ట్రాక్టర్ గడ్డి రూ.15 వేల నుంచి 20 వేలకు కొనుగోలు చేసి జీవాలను కాపాడుకొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూగజీవాల రైతులకు సబ్సిడీపై దాణా అందించడంతోపాటు గ్రామశివారు, అటవీ ప్రాంతాల్లో నీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

మెట్ట పైర్లు

చేతికందేనా!?

పంటలకు నీరందించేందుకు రైతుల కష్టాలు

ఒక్క తడికి ఎకరాకు రూ.5 -10 వేలు ఖర్చు ● రాళ్లపాడులో నీళ్లున్నా వదలని అధికారులు

కొండాపురం, ఏప్రిల్11: మండల పరిధిలో సాగుచేసిన మెట్టపైర్లు కాపాడుకోవడానికిరైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండలు అధికమవుతుండటంతో పంటకు నీరందించేందుకు నానా తంటాలు పడుతున్నారు. వేల అడుగులదూరం నుంచి నీటిని తరలించి పంటలను కాపాడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో మెట్ట సాగుచేసిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

● మిరప, పొగాకు రైతులకు తప్పని కష్టాలు

మండల పరిధిలోని సాయిపేట, నేకునాంపేట, రేణమాల, గుడవళ్లూరు, కొమ్మి, సత్యవోలు, పార్లపల్లి, శెట్టిపాలెం, గొట్టిగుండాల తదితర గ్రామాల్లో మిరప, పత్తి, పొగాకు తదితర పంటలను అధికంగా సాగుచేశారు. వర్షాభావం కారణంగా పొగాకు పంటకు ఒక్క తడి వేస్తే సరిపోతున్నప్పటికీ ఈ ఒక్క తడిని వేయాలంటే ఎకరానికి రూ .5 వేల నుండి రూ.10 వేల వరకు ఖర్చవుతుందని రైతులు అంటున్నారు. ప్రధానంగా పత్తి, మిరప పైర్లకు వేల అడుగుల దూరం నుంచి రెండు చోట్ల ఇంజన్ లు ఏర్పాటుచేసి టార్పాలిన్ పట్టలు పరచి రెండు రోజులపాటు వేయాల్సి వస్తుండటంతో ఇంత మొత్తంలో ఖర్చవుతుందని రైతులు చెప్తున్నారు. ఈ రెండు పైర్లకు 15 రోజులకు ఒకసారి నీరు వేయాల్సి ఉంది. ఈవిధంగా నాలుగైదు తడులు నీరు వేయాల్సి వస్తుంది. ఒక్క తడికి రూ.10 వేలు ఖర్చవుతుండగా 5 తడులు వేయాలంటే రూ.50 వేలు ఖర్చవుతుంది. ఇంతమొత్తంలో ఖర్చవుతుండగా పెట్టుబడులు అధికమవుతుండగా గిట్టుబాటు ధర దక్కకపోతే భారీ స్థాయిలో నష్టపోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.



టార్పాలిన్ పట్టలతో నీటిని తరలిస్తున్నరైతులు

● రిజర్వాయరులో నీరున్నా..

రాళ్లపాడు రిజర్వాయరులో నీరున్నా కుడి కాలువకు ఒక్కసారి కూడా అధికారులు నీటిని విడుదలచేయలేదు. ఈకాలువకు నీరు వదిలినట్లయితే కాలువ నుంచి నీటిని లిఫ్ట్‌చేసి పైర్లకు అందించేవారు. ఈనీటి విడుదలపై ఇటు అధికారులు అటు పాలకులు పట్టించుకోకపోవడంతో మూడు నెలల నుంచి రైతులు తమ పంటలకు నీరందించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. నీటి కోసం ఎక్కువ మొత్తంలో ఖర్చవుతుందని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రాళ్లపాడు రిజర్వాయరు నుంచి కుడి కాలువకు నీటిని విడుదల చేయించి తమ పంటలను కాపాడుకునేందుకు సహకరించాలని రైతులు కోరుతున్నారు.



సాయిపేటలో సాగుచేసిన పత్తి పంట




ట్రాక్టరు సాయంతో పైర్లకు నీటిని తరలిస్తున్నరైతులు

అర్ధంతరంగా ఆగిపోయాయి

- కావలిలో సాగని సైడు కాలువల నిర్మాణం
- ట్రంకురోడ్డులో దుర్గంధం ● ప్రజలకు అసౌకర్యం

కావలిటౌన్, ఏప్రిల్ 11 : రూ. 100 కోట్లతో ట్రంకురోడ్డు అభివృద్ధి పనులంటూ ఐదేళ్లుగా తెగ ప్రచారం చేసుకున్న అధికార పార్టీ రోడ్డు అభివృద్ధి ఏమోగానీ కాలువల నిర్మాణమంటూ అరకొర పనులు చేపట్టి అర్ధంతరంగా ఆపేశారు. దీంతో ఎక్కడి మురుగు అక్కడే నిల్వ చేరి దుర్గంధభరితంగా మారింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి ట్రంకురోడ్డు అభివృద్ధికి నూరు కోట్లు మంజూరయ్యాయని, అందులో భాగంగా ముందుగా సైడ్ కాలువ నిర్మాణం చేపట్టి అనంతరం రోడ్డు వెడల్పు పనులు, డివైడర్లు, ఆకర్షణీయంగా చెట్లు, సెంట్రల్ లైటింగ్, చేపడతామన్న నేతల మాటలు నీటి మూటలుగా మిగిలాయి.



కావలి టీచర్స్ కాలనీ వద్ద ట్రంకురోడ్డులో నిలిచిపోయిన కల్వర్టు నిర్మాణం

● పూర్తి కాని పనులు

బృందావనం హౌసింగ్ కాలనీ వద్ద నుంచి ముసునూరు చివరి వరకు ట్రంకురోడ్డుకు ఇరువైపులా సైడ్ కాలువల నిర్మాణం ప్రారంభించి దాదాపు నాలుగేళ్లు పూర్తి కావస్తున్నది. కాలువల నిర్మాణం పూర్తిచేయక అసంపూర్తిగా వదిలివేయడంతో ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ముక్కలు ముక్కలుగా కాలువ నిర్మాణ పనులు చేపట్టి వాటిని అనుసంధానం చేయకపోవడంతో కాలువల్లో మురుగు ఎక్కడికక్కడ నిల్వ చేరింది. దీంతో దుర్గంధ వెదజల్లుతోంది.



ఆటోనగర్ ట్రంకురోడ్డు వద్ద అసంపూర్తిగా కాలువ నిర్మాణం

● అవస్థల్లో ప్రజలు

అక్కడక్కడ కనెక్షన్ రోడ్లు వద్ద కాలువ నిర్మాణం కోసం తవ్వి కల్వర్ట్‌ల నిర్మాణం చేపట్టక వదిలివేశారు. దీంతో రాకపోకలు సాగించేందుకు నానా ఇబ్బందులు పడ్డ ప్రజలు వారే మట్టితో గుంతలను పూడ్చుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ఇకపోతే అరకొరగా కాలువ నిర్మాణం చేపట్టిన ప్రాంతాల్లో చుట్టుపక్కల ప్రజలు సైడ్‌కాలువలో డ్రైనేజ్ పైపులు వదులుకుని ఉండడంతో మురుగు ముందుకు ప్రవహించక, నిల్వ చేరి దుర్గంధభరితంగా మారడమేకాక దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. మురుగు ముందుకు ప్రవహించకపోవడంతో ట్రంకురోడ్డు ఆనుకుని ఉన్న గృహాలు, షాపుల యజమానులు దుర్గంధం భరించలేక అల్లాడిపోతున్నారు. కాలువల నిర్మాణానికి ఎప్పటికి మోక్షం లభిస్తుందో వేచి చూడాలి.

భక్తిశ్రద్ధలతో రంజాన్

ఉదయగిరి : మండలంలో గురువారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో రంజాన్‌ను జరుపుకున్నారు. మండలంలోని గండిపాళెం, వెంగళరావు నగర్, దాసరిపల్లి, బిజ్జంపల్లి, అయ్యవారిపల్లి, పుల్లాయపల్లి గ్రామాల్లోని ఈద్గాల వద్ద ఇమామ్‌లు ఖురాన్ ప్రాముఖ్యతను వివరించారు. ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. హిందూవులను విందుకు ఆహ్వానించి, పేదలకు దానధర్మాలు చేశారు.

వరికుంటపాడు : మండలంలోని తూర్పుబోయమడగల, వరి కుంట పాడు, జడదేవి, హాస్సేన్‌నగర్, తిమ్మారెడ్డిపల్లి, వేంపాడు, విరు వూరు, కొత్తపల్లి, తోటలచెరువుపల్లి తదితర గ్రామాల్లో వేకువజాము నుంచే ముస్లింలు ఎంతో ఉత్సాహంగా ఈద్గాల వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే బంధుమిత్రులకు విందు భోజ నాలు ఏర్పాటు చేశారు.

అల్లూరు : మండలంలోని అన్ని మసీదుల్లో గురువారం రంజాన్ నమాజు నిర్వహించారు. అల్లూరు, నార్తుమోపూరు, ఇస్కపల్లిలోని మసీదు ల్లో ముస్లింలు అత్యధికంగా పాల్గొని నమాజు చేశారు. అనంతరం తాము చేసుకున్న వంటకాలను స్నేహితులు, శ్రేయోభిలాషులకు పంచిపెట్టారు.

జలదంకి : మండలంలోని జలదంకి, గట్టుపల్లి, చినక్రాక, బీకే అగ్రహారం, క్రిష్ణాపాడు, సోమవరప్పాడు, జమ్మలపాలెం, చోడవరం గ్రామా ల్లో గురువారం ముస్లింలు రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరి పారు. చినక్రాకలో జరిగిన ప్రార్థనల్లో మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపా ల్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గొర్రెపాటి యలమందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం : రంజాన్‌ను ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధల తో జరుపుకున్నారు. లింగసముద్రంలోని మసీదులో జరిగిన నమాజు లో మత ప్రవక్త సందేశమిస్తూ, ప్రతి ఒక్కరూ ప్రేమ, దయ, సహ నం కలిగి ఉండాలన్నారు. మండలంలోని మొగిలిచెర్ల, ఆర్‌ఆర్ పాలెం, పెదపవని, చినపవని తదితర గ్రామాల్లోని ముస్లింలు రంజాన్‌ను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా లింగసముద్రంలోని ఎస్ఎం ఎస్ మందుల షాపు యజమాని షేక్ హనీఫ్ 40 నిరుపేదలకు బిర్యానీ పొట్లాలు అందజేశారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్) : మండలంలో ముస్లింలు రంజాన్ వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దుత్త లూరుతోపాటు మండలంలోని నందిపాడు, వెంకటంపేట, నర్రవాడ, ఏరుకొల్లు తదితర గ్రామాల ఈద్గా మైదానాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. బంధుమిత్రులను విందుకు ఆహ్వానించారు.

కావలి : గురువారం కావలిలో రంజాన్ వేడుకలను నిర్వహించా రు. పట్టణంలోని వివిధ మసీద్‌ల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రైల్వేరోడ్డులోని జామియా మసీద్‌లో ముఫ్తీ రషీద్ మౌలానా ప్రార్థనలను జరిపించారు. వైకుంఠపురంలోని మదీనా మసీద్ ఈద్గాలో ముఫ్తీ జలీల్ అహ్మద్ ప్రార్థనలను చేయించారు. అలాగే పట్టణంలోని అన్ని మసీదులు, ఈద్గాల లో ప్రవక్తలు రంజాన్ పండుగ ఆవశ్యకతను వివరించారు. కొందరు మసీ దులకు వచ్చి ప్రార్థనలు నిర్వహించగా, మిగిలిన వారు ఇళ్లలో ప్రార్థన లు చేశారు.


కావలి : మదీనా మసీదు ఈద్గాలో ప్రార్థనలు చేయిస్తున్న ముఫ్తీ జలీల్ అహ్మద్

కలిగిరి : మండలంలోని గురువారం ముస్లింలు దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పలువురు ముస్లింలు హిందువులను విందు భోజనాలకు అహ్వానించారు. స్వీట్స్ పంచిపెట్టారు.

సీతారామపురం : మండలంలో గురువారం ముస్లింలు, భక్తిశ్ర ద్ధలతో రంజాన్‌ను నిర్వహించారు. స్థానిక మసీదుల నుంచి ఈద్గా వరకు వెళ్లి అల్లాను స్మరించుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిం చారు. ఇమామ్ షేక్ యూసూఫ్ మౌలానా ఖురాన్ సందేశమిచ్చారు.

కందుకూరు : రంజాన్‌ను ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచే నూతన వస్త్రాలు ధరించి బంధు వులు, ఆత్మీయుల మధ్య పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకు న్నారు. పట్టణంలోని పెద్దమసీదు, జామియామసీదు, సంతోష్‌నగర్ మసీదులతో పాటు కోటకట్ట వీధి, పామూరు బస్టాండ్ సెంటర్, లుంబీనీవనం వద్ద ఈద్గాలలో పెద్దసంఖ్యలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఎన్నికల ప్రచారంలో భాగంగా రంజాన్ కేకు కట్‌చేసి ముస్లింలకుపంచిపెట్టారు.

బిట్రగుంట : బోగోలు మండలంలోని పలు ఈద్గాల వద్ద ముస్లిం మత గురువులు గురువారం రంజాన్ విశిష్టతను వివరించారు. విశ్వనాథరావు పేట పంచాయతీ ఇబ్రహీంపేట, చెంచులక్ష్మీపురం, నాగులవరంలోని ఈదా ల వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనలో భారీ సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.


జలదంకి : చినక్రాకలో జరిగిన ప్రార్థనలో పాల్గొన్న వంటేరు వేణుగోపాల్‌రెడ్డి,


బిట్రగుంట : ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఘనంగా రంజాన్


అనంతసాగరం ఈద్గాలో నమాజు చేస్తున్న ముస్లింలు

ఆత్మకూరు, ఏప్రిల్ 11 : రంజాన్ పండుగను ఆత్మకూరు పట్టణం, మహిమలూరు, కరటంపాడు, అప్పారావుపాళెం, బట్టేపాడు తదితర గ్రామాల్లో ముస్లీం సోదరులు ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరులో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, పలువురు వైసీపీ నేతలు ముస్లీం సోదరులతో కలిసి ప్రార్థనలలో పాల్గొన్నారు. పలువురు టీడీపీ నేతలు ముస్లీం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు.

సంగం: మండలంలోని అన్ని గ్రామాల్లో రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సంగం, దువ్వూరు, సిద్దీపురం, జండాదిబ్బ, తలుపూరుపాడు, మర్రిపాడు తదితర ప్రాంతాల్లో ఈద్గాలో ప్రార్థనలు చేశారు.

అనంతసాగరం : మండలంలోని సోమశిల, అనంతసాగరం, ఉప్పలపాడు, గౌరవరం, పాతదేవరాయపల్లి, కేడీపల్లి, ముస్తాపురం, ఆమనిచిరివేళ్ల తదితర గ్రామాల్లో రంజాన్ వేడుకలు జరుపుకున్నారు. ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

చేజర్ల : మండల కేంద్రమైన చేజర్లతో పాటు ఆదురుపల్లి చిత్తలూరు, తిమ్మాయిపాళెం, టి.కేపాడు, మాముడూరు, పుట్టుపల్లి, పెరుమాళ్ళపాడు, మడపల్లి, పాడేరు తదితర గ్రామాల్లో రంజాన్ పండుగను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గా, మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.


చేజర్ల : ఆదురుపల్లి ఈద్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

అరాచక పాలనకు చరమగీతం పాడండి : కాకర్ల

వింజమూరు, ఏప్రిల్ 11: రాష్ట్రంలో నడుస్తున్న అరాచక పాలనకు ప్రజ లు సమరగీతం పాడాలని ఉదయగిరి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ తెలిపారు. పట్టణంలో గురువారం సాయంత్రం వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి పాత బస్టాండ్ సెంటర్ వరకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఎంపీ అభ్యర్థి వేమి రెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ఆయన పట్టణంలోని ప్రధాన ర హదారి వెంబడి ఉన్న దుకాణదారులను కోరారు. కార్యక్రమంలో నాయకులు గొంగటి రఘునాథరెడ్డి, దంతులూరు వెంకటేశ్వరరావు, గూడా నరసారెడ్డి, నరేంద్ర, కొండపల్లి వెంకటేశ్వర్లు, చల్ల వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.


వింజమూరులో ప్రచారం నిర్వహిస్తున్న కాకర్ల సురేష్ తదితరులు

రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో కాకర్ల సురేష్

పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లింలు ఈద్గా దగ్గర ని ర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి అ భ్యర్థి కాకర్ల సురేష్ పాల్గొన్నారు. మత పెద్ద మౌలాసాబ్ పఠించిన దివ్య ఖు రాన్ సూత్రాలను ఆలకించారు. రంజాన్ పండుగ అంటే దానాల పండుగ అని అర్థం. కఠిన ఉపవాసాలు ఉంటూ పూర్తిగా అల్లాహ్ మార్గంలో పయనిస్తూ మానవాళికి శాంతి సందేశాన్ని అందించే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ పం డుగ ప్రార్థనల్లో పాల్గొనడం, పవిత్ర దువాను పొందడం తన అదృష్టంగా భా విస్తున్నానని కాకర్ల సురేష్ తెలిపారు. ప్రార్థనల అనంతరం ముస్లింలకు శు భాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబా బు యాదవ్, రాష్ట్ర మైనారిటీ సెల్ నాయకులు షేక్.రియాజ్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు సయ్యద్ సజీల్, తదితరులు ఉన్నారు.

ఉదయగిరి రూరల్ : రంజాన్ సందర్భంగా గురువారం స్థానిక ఈద్గా మైదానంలో ముస్లిం లు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థన ల్లో ఉదయగిరి ఉమ్మడి అభ్యర్థి కా కర్ల సురేష్, వైసీపీ అభ్యర్థి మేక పాటి రాజగోపాల్‌రెడ్డిలు పాల్గొన్నా రు. అనంతరం ముస్లింలకు రంజా న్ శుభాకాంక్షలు తెలియచేశారు. ప్రార్థనల్లో వారితోపాటు పార్టీ నా యకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


ఉదయగిరిలో జరిగిన రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న కాకర్ల సురేష్

మహాత్మా జ్యోతిరావు పూలేకు ఘననివాళి

కందుకూరు : ఏప్రిల్ 11: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా గురువారం స్థానిక టీడీ పీ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. కం దుకూరు టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వర రావు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వే సి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు దా మా మల్లేశ్వరరావు, చిలకపాటి మధుబాబు, ముచ్చు వేణు, సవిడిబోయిన వెంకటకృష్ణ, భవనాసి వెంకటే శ్వర్లు, చుండూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నా రు. అలాగే పూలే జయంతి కార్యక్రమాన్ని బీసీ సం ఘాల ఆధ్వర్యంలో పట్టణంలోకి కోవూరు రోడ్డులో ఉ న్న ఓ కల్యాణ మండపంలో గురువారం రాత్రి నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో సంగా రమణయ్య, సంగా మహేంద్ర, పెరుగు ప్రసాదు, శివయ్య, బీవీ రమణ, కె. మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



కందుకూరులో నివాళి అర్పిస్తున్న ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు

స్థానిక సీపీఐ కార్యాలయంలో నియోజకవర్గ కార్యదర్శి బి. సురేష్‌బాబు ఆ ధ్వర్యంలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వై. ఆనంద్‌మోహన్, ఉప్పుటూరి మాధవరావు, హుస్సేన్, లక్ష్మీనారాయణ, బాల బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు. టీడీపీ నేత ఇంటూరి రాజేష్ కార్యా లయం నుంచి పలువురు బీసీ నాయకులు ర్యాలీ నిర్వహించి పూలే విగ్రహా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆవుల నరసింహారావు, కె. వెంకటే శ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి : స్థానిక ఆరుంధతీయపాళెంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సం దర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బకీరు జాషువా మాట్లాడుతూ పూలే ఆశయాలను ప్రతిఒక్కరూ తప్పక పా టించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మా ర్పీఎస్ నాయకులు బెజవాడ బాలగుర వయ్య, బకీరు కిరణ్, నల్లిపోగు హజర త్, మధు, చిన్న, కృష్ణ పాల్గొన్నారు.

కావలి : జ్యోతిరావు పూలే జయం తిని గురువారం కావలిలో ఘనంగా ని ర్వహించారు. ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి టీ డీపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పూలే చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయ కులు పాల్గొన్నారు. కాగా దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో ట్రంకురో డ్డులో ఉన్న పూలే విగ్రహానికి సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి, పలువురు సభ్యులు నివాళులు అర్పించారు.

లింగసముద్రం : జ్యోతిరావు పూలే జయంతిని లింగసముద్రంలోని టీడీ పీ కార్యాలయంలో గురువారం మండల తెలుగు యువత అధ్యక్షుడు అడపా రంగయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్‌ల ఆధ్వర్యంలో నిర్వహించా రు. వారు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.ఈ సంద ర్భంగా నేతలు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్ బాలకోటయ్య, పీ బాలకోటయ్య, అడపా నర్సయ్య, యు నాగేశ్వర రావు, వంకాయలపాటి మాల్యాద్రి, గుళ్ళా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు.. ఊరూరా ప్రచారాలు

మర్రిపాడు, ఏప్రిల్ 11: ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి స్వగ్రామం బ్రా హ్మణపల్లికి చెందిన వైసీపీ నేతలు గురువారం టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే బావ బిజివేముల సురేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో వారు నెల్లూరులోని ఆనం రామనారాయణరెడ్డి నివాసానికి వెళ్లారు. వారికి టీడీపీ కండువా కప్పి పా ర్టీలోకి ఆయన ఆహ్వానించారు.


మర్రిపాడు : ఆనం సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

కావ్య సమక్షంలో టీడీపీలో చేరిక

కావలి : కావలి రూరల్ మండలం చెన్నాయపాలెం వైసీపీ ఎంపీటీసీతో సహా పలువురు వైసీపీ నాయకులు గురువారం టీడీపీలో చేరారు. చెన్నాయ పాలెం మాజీ సర్పంచి మర్రి అంజయ్య, మర్రి శివప్రసాద్ ఆధ్వర్యంలో ఎంపీటీసీ మానం విజయనిర్మల, ఆమె భర్త రమేష్‌లు, అన్నగారిపాలెంకు చెందిన కాకు బాబూరావు, సురేష్‌మాలి వారి అనుచరులు టీడీపీలో చేరారు. కావలి 31వ వార్డు వైసీపీ నాయకుడు గన్నవరం దశరథరామయ్య, 18వ వా ర్డు బీసీ కాలనీకి చెందిన పాశం ఏడుకొండలు వైసీపీని వీడి టీడీపీలో చే రారు. వీరందరికి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఆనం గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

అనంతసాగరం : మండలంలో కలసికట్టుగా పనిచేసి ఆత్మకూరు అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి గెలుపు కోసం పనిచేద్దామని మండల నూతన టీ డీపీ అధ్యక్షురాలు మునగపాటి సునీత తెలిపారు. గురువారం చిలకలమర్రి లో ఆగ్రామ నాయకులతో సమావేశం నిర్వహించి పలుసూచనలు చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని అన్నిగ్రామాలోని నా యకులను, కర్యకర్తలను కలుపుకొనిపోయి పార్టీని మరింత బలోపేతం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు మునగపాటి సుబ్బా రాజు, వెంకటరాజు, సీనియర్ నాయకులు సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

సింగణపల్లిలో టీడీపీ ఇంటింటి ప్రచారం

మర్రిపాడు : మండలంలోని సింగణపల్లిలో టీడీపీ నేతలు గురువారం టీడీపీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గడప గడపకు తిరిగి బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కరపత్రాలను పంచి సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఆనం రామనారాయణరెడ్డికి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కా ర్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఆరికట్ల జనార్దన్‌నాయుడు, మాజీ ఎంపీపీ కటారి రమణయ్య, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు శాఖమూరి నారాయణ, తదితరులు పాల్గొన్నారు

● కొండాపురంలో..

కొండాపురం : ఉదయగిరి నియోజకవర్గ ఎన్డీయే అభ్యర్థి కాకర్ల సురేష్ గెలుపు కోసం మండలకేంద్రంలోని బీసీ కాలనీలో టీడీపీ నేత నర్రా శివ న్నారాయణ ఆధ్వర్యంలో గురువారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందచేశారు. కార్యక్రమంలో నాయకులు పోలినేని రమే ష్, పీ.చంద్రబాబునాయుడు, బద్దిపూడి మాచర్ల, వీ.మణికుమార్, పీ.వెంకట నరసింహం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి

బిట్రగుంట : టీడీపీ బలోపేతానికే తాము పని చేస్తున్నామని కాంద్ర యువనేస్తం వ్యవస్థాపకుడు కాంద్ర సతీష్‌నాయుడు అన్నాడు. గురువారం ఆయన నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నెల్లూరులో మర్యాద పూర్వకంగా కలిశారు. కావలి నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై వీ పీఆర్‌తో మాట్లాడినట్లు సతీష్ తెలిపారు. కార్యక్రమంలో మాలేపాటి సుబ్బా నాయుడు, గంగినాయుడు, రామసుబ్బానాయుడు, మల్లికార్జున, సురభి శ్రీను, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంద్ర యువనేస్తం సభ్యులు, నాగులవరం, అల్లిమడుగు, ఎస్వీపాలెం, జువ్వలదిన్నె పంచాయతీల నుంచి పలువురు పెద్దలు కూడా వేమిరెడ్డిని కలిసినట్లు సతీష్‌నాయుడు తెలిపారు.

భవిష్యత్ మారాలంటే టీడీపీకి ఓటేయండి

ఉలవపాడు, ఏప్రిల్ 11 : రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే టీడీపీకి ఓ టు వేయాలని గురువారం టీడీపీ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేపట్టాయి. ఉలవపాడులోని దర్గా సెంటర్‌లో కార్యకర్తలు, నాయకులు కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పొడపాటి సుధా కర్, రాచగల్లు సుబ్బారావు, ఎంపీటీసీ దార్ల యలమందమ్మ, తొట్టెంపూడి మాల్యాద్రి, వాసు,వార్డు మెంబర్ శివ, దాసరి వెంకట్రావు, ఎస్‌కే జిలానీ బాషా, ఎస్‌కే బాబు తదితరులు పాల్గొన్నారు.

కావలి రూరల్‌లో ప్రచారం

కావలి రూరల్ : కావలి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి గురు వారం రాత్రి కావలి మండలం కొనదిన్నె, మోర్లవారిపాలెం, మన్నంగిదిన్నెలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కావలి మండల పరి శీలకుడు కండ్లగుంట మధుబాబు నాయుడు, జనసేన నాయకుడు సిద్దూ, టీడీపీ నాయకులు ఆవుల రామక్రిష్ణ,ఉప్పాల వెంకట్రావు, వాయిల శీనుబా బు, జంపాని శ్రీనివాసులు, దాసు, ఉప్పాల నారాయణ, దినేష్, మోర్ల సురేష్, మోర్ల వెంకట్రావ్, నాశిన ప్రసాద్, కోసూరి వెంకటేశ్వర్లు, జంపాని వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో ఇంటూరి సౌజన్య

కందుకూరు : పట్టణంలోని 8వ వార్డు కోటారెడ్డినగర్‌లో గురువారం టీడీ పీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య ఇం టింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇం టూరి నాగేశ్వరరావును ఎమ్మెల్యేగా, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని ఎంపీగా గెలిపిం చాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముచ్చు శ్రీను, రావి రాంబాబు, కొచ్చర్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


కందుకూరు : ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఇంటూరి సౌజన్య


అనంతసాగరంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సునీత


మర్రిపాడులో కరపత్రాలు పంచుతున్న టీడీపీ నేతలు

బంధువుల నుంచి రక్షణ కల్పించండి

జలదంకి, ఏప్రిల్11: తన మామ, బావమరిది కుట్టు బోయిన బాలయ్య, శివక్రిష్ణ, మరికొంతమంది కుటుంబ స భ్యుల నుంచి తనకు, తన కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని జలదంకి బీసీకాలనీకి చెందిన మారుబోయిన మధు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలే కరులతో మాట్లాడుతూ ఈనెల 8న తాను ఇంట్లో లేని స మయంతో తన తల్లి రమణమ్మ, పిన్నమ్మ అలివేలమ్మల పై బాలయ్య, శివక్రిష్ణ, చెంచమ్మ, భార్య శివనందినిలు వ చ్చి మారణాయుధాలతో దాడి చేసి గాయపరిచారని పే ర్కొన్నారు. దాడి చేసిన వారిపై కేసుపెట్టినా చర్యలు తీసు కోలేదన్నారు. ఎస్ఐ ఆదిలక్ష్మి విచారించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరారు.ఈ విషయమై ఎస్ఐని వివరణ కోరగా కేసు నమోదు చేసి విచారిస్తున్నా మన్నారు.

ఆదరిస్తే.. అభివృద్ధికి కృషి చేస్తా!

అల్లూరు, ఏప్రిల్ 11 : తనను గెలిపిస్తే కావలి అభివృ ద్ధికి కృషి చేస్తానని రిపబ్లిక్ పార్టీ ఇండియా అంబేడ్కర్ రిస్ట్ అభ్యర్థి ఎల్లు సాల్మన్‌రాజు అన్నారు. గురువారం ఆ యన మండలంలోని ఇందుపూరు గిరిజనకాలనీ, బీసీ కాల నీల్లో పర్యటించి, ప్రచారం చేశారు. కార్యక్రమంలో కోవూ రు బాబు, నక్కా గిరి, కప్పల నవీన్ కుమార్, పెండెం మస్తానయ్య, సంతోష్‌కుమార్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

'రాకేష్‌పై దాడి గర్హనీయం'

కందుకూరు, ఏప్రిల్ 11: టీడీపీ వాణిజ్య విభాగం నా యకుడు దూండి రాకేష్‌పై మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీని వాస్ అనుచరులు దాడిచేయటం గర్హనీయమని టీడీపీ వా ణిజ్యవిభాగం కందుకూరు నియోజకవర్గ అధ్యక్షుడు మో దడుగు వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో ఖండిం చారు. పోలీసులు సైతం రాకేష్‌నే కొట్టుకుంటూ పోలీస్‌స్టేష న్‌కు తరలించటం దారుణమన్నారు. పోలీసు అధికారుల పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేస్తామన్నారు.

మలిశెట్టి ఈశ్వరమ్మకు పలువురి నివాళి


మలిశెట్టి ఈశ్వరమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కావ్య క్రిష్ణారెడ్డి, టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు

కావలి, ఏప్రిల్11: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు మాతృమూర్తి ఈశ్వరమ్మ ఉత్తరక్రియలు గురువారం కావలి నార్త్ జనతాపేటలోని ఆయన స్వగృహంలో జరిగాయి. కా ర్యక్రమంలో టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ కావలి మాజీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడితోపాటు పలువురు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొని ఆమెకు నివాళులు అర్పించారు. అనంతరం మలిశెట్టి వెంక టేశ్వర్లును పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

గుండెమడకలలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

వింజమూరు, ఏప్రిల్ 11 : మండలం లోని గుండెమడకలలో గురువారం అం బేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని పూలే జయంతి సందర్భంగా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కిష్టయ్య, పెంచల య్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సురేష్ మాదిగ పాల్గొన్నారు. ఆయన మాట్లాడు తూ రాజ్యాంగాన్ని రచించి ప్రజలకు స్వేచ్ఛ తీసుకొచ్చిన అంబేడ్కర్ విగ్రహాన్ని గ్రామా ల్లో నెలకొల్పడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు గొల్లపల్లి శ్రీని వాస్, ఉదయ్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


విగ్రహావిష్కరణలో పాల్గొన్న నేతలు

ఆదరిస్తే రాళ్లపాడు ఎడమ కాలువ పనులు పూర్తిచేయిస్తా : ఇంటూరి

వలేటివారిపాలెం ఏప్రిల్ 11: రానున్న ఎన్నికల్లో తన ను ఆదరించి ఆశీర్వదిస్తే రాళ్లపాడు ఎడమ కాలువ పొ డిగింపు పనులు పూర్తిచేయించేందుకు కృషిచేస్తానని టీ డీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని శాఖవరంలో గురువారం ఆయన ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ముందుగా గ్రామదేవత అంకమ్మ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎడమకాలువ పొడిగింపు పనులు పూర్తయితే గ్రామంలోని చెరువుకు సంవృద్ధిగా నీరువచ్చి పంటలు బాగా పండుతా యన్నారు. ఆయన వెంట మాదాల లక్ష్మీనరసింహం, వడ్లమూడి వెంకటరావు, గుర్రం మాల్యాద్రి తదితరులు ఉన్నారు.

స్వార్థపరులకు జనసేనలో చోటులేదు..

సీతారామపురం, ఏప్రిల్ 11 : స్వార్థపరులకు జనసే నలో చోటులేదని జనసేన ఉదయగిరి నియోజకవర్గ ఇన్ చార్జి భోగినేని కాశీరావు అన్నారు. సీతారామపురంలోని జ నసేన పార్టీ కార్యాలయంలో గురువారం కార్యకర్తల సమా వేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ జిల్లా ఇన్‌చార్జ్ మనుక్రాంత్‌రెడ్డి తన స్వార్థం కో సం వైసీపీలో చేరడం దారుణమన్నారు. అతను వెళ్లిపో వడం వల్ల పార్టీకి వచ్చిన నష్టమేమీ లేదన్నారు. కార్యక్ర మంలో నాయకులు పాలిశెట్టి శ్రీను,విఠల నారాయ ణ,కాశీరత్తయ్య,పవన్, మహేష్, పిడుగు రాహుల్ తదిత రులు పాల్గొన్నారు.

నేడు శకునాలపల్లిలో ఆరోగ్య సురక్ష

ఉదయగిరి : మండలంలోని శకునాలపల్లి సచివాల యం వద్ద శుక్రవారం ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమం జరుగు తుందని పంచాయతీ కార్యదర్శి కరీముల్లా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

మద్యం అక్రమ నిల్వలపై నిఘా ఉంచండి

కావలి రూరల్, ఏప్రిల్11: ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మ ద్యం అక్రమ నిల్వలపై నిఘా ఉంచాలని సెబ్ డిప్యూటీ కమిషనర్ శ్రీని వాసరావు పేర్కొన్నారు. పట్టణంలోని సెబ్ పోలీస్‌స్టేషన్‌లో గురు వారం సిబ్బందితో సమీ క్ష నిర్వహించారు. ఆ యన మాట్లాడుతూ మ ద్యం అమ్మకాలు, నిల్వల పై నిఘాపెట్టి, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల్లో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ అక్రమ నిల్వలను గుర్తించి కేసులు నమోదు చేయాలన్నారు. సమీక్షలో ఏఈఎస్ ప్రభాకర్‌రావు, కావలి, కందు కూరు సెబ్ సీఐలు లక్షణస్వామి, వెంకటేశ్వర్లు, కావలి సెబ్ ఎస్ఐ రాజేశ్వరి, సిబ్బంది తదిత రులు పాల్గొన్నారు.


సెబ్ అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న సెబ్ డిప్యూటీ కమిషనర్

● మద్యం అక్రమ నిల్వలపై ఉక్కుపాదం

కలిగిరి : ఎవరైనా మద్యం అక్రమ నిల్వలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సెబ్ రాష్ట్ర డిప్యూటీ కమిషనర్ ఎన్‌సీ శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం స్థానిక సెబ్ కా ర్యాలయంలో కలిగిరి, ఆత్మకూరు, ఉదయగిరి పరిధిలోని సెబ్ సిబ్బందితో సమీక్ష ని ర్వహించారు. అధిక సంఖ్యలో మద్యం సీసాలు కలిగి ఉన్నవారిపై కఠినచర్యలు తీసుకుంటా మన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ కే ప్రభాకరరావు, కలిగిరి, ఆత్మకూరు, ఉదయగిరి సెబ్ సీఐలు వై వెంకటేశ్వర్లు, కిరణ్‌కుమార్, రమణమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతారామస్వామి బ్రహ్మోత్సవాల ప్రారంభం

సంగం, ఏప్రిల్ 11: మండలంలోని సిద్దీపురంలో ఉన్న సీతారామస్వామి ఆలయంలో గురువారం బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. అంకురార్పణ, పల్లకీసేవతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

భక్తిశ్రద్ధలతో రంజాన్



వెంకటాచలం మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

వెంకటాచలం, ఏప్రిల్ 11: ముస్లింలు గురువారం రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కసుమూరు ఈద్గా మైదానంలో ప్రార్థనలు నిర్వహించారు. అదేవిధంగా వెంకటాచలం, గొలగమూడి, కనుపూరు, పూ డిపర్తి, సర్వేపల్లి తదితర గ్రామాలలోని మసీదులలో ముస్లింలు ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా కసుమూరు మస్తాన్ వలి దర్గాలో పడమటి వాకిలి తెరిచారు. ప్రతీ రంజాన్ పండుగ నాడు ఈ వాకిలి తెరుస్తారు. ఈ వాకిలి గుండా దర్గాలోకి వెళ్లి మస్తాన్‌వలి సమాధిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం ఈ నేపథ్యంలో పడమటి వాకిలి గుండా భక్తులు దర్గాలోకి వెళ్లి ప్రార్థనలు నిర్వహించారు.

● **పొదలకూరు:** పట్టణం, మండలవ్యాప్తంగా ముస్లిం సోదరులు ఘనంగా రంజాన్ వేడుకలు జరుపుకున్నారు. ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

● **తోటపల్లిగూడూరు :** మండంలోని కొత్తపాలెం, కోడూరు, వెంకన్నపాలెం, వరిగొండ, సౌత్ఆములూరు గ్రామాల్లో గురువారం రంజాన్ పండుగను ముస్లిం కుటుంబాలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

● **సైదాపురం :** సైదాపురం, ఊటుకూరు, కలిచేడు, మర్లపూడి తదితర గ్రామాల్లోని ముస్లింలు మసీదుల వద్ద ప్రత్యేక పార్థనలు నిర్వహించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మధ్యాహ్నం పేదలకు అన్నదానం నిర్వహించారు.

● **బుచ్చిరెడ్డిపాళెం :** బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీతోపాటు మండలంలోని అన్ని గ్రామాలలో రంజాన్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మత గురువులు మసీదుల్లో ప్రార్థనలు చేసి సందేశాలు వినిపించారు. అనంతరం పేదలకు దాన, ధర్మాలు చేశారు.

● **కోవూరు :** రంజాన్ పండుగ సందర్భంగా గురువారం స్థానిక మస్జిద్ రహమాన్యా మద్రాస తక్కే మసీదు, ఈద్గాల్లో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనలకు హాజరైన వారికి మజ్జిగ చల్లని నీరు టక్కే మసీదు తరపున అందించారు. స్థానిక సత్రంవీధిలోని పెద్ద మసీదును రంజాన్ సందర్భంగా విద్యుద్దీపాలతో అలంకరించారు.



బుచ్చిరెడ్డిపాళెం : కొత్త బస్టాండ్ మసీదులో..

జ్యోతిరావుపూలేకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నిరంజనబాబురెడ్డి

కోవూరు, ఏప్రిల్ 11: జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ జాతీయ కమిటీ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ పూలే ఆశ సాధనకు కృషి చేయాలని కోరారు. రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు దొడ్డంరెడ్డి నిరంజన బాబురెడ్డి తన కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు కవరగిరి శ్రీలత, మండల ఏఎంసీ చైర్మన్ నీలపరెడ్డి హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు వేణుగోపాల్, పంచాయతీ రాజ్ అధ్యక్షులు శివకుమార్‌రెడ్డి, పాల్గొన్నారు.

కొడవలూరు : బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి పాటుపడిన మహోన్నత వ్యక్తి జ్యోతీ రావు పూలే అని జనతా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దాసరి ప్రసాద్ అన్నారు. మండలంలో టపాతోపు వద్దనున్న విశ్వజననీ ఆశ్రమంలో చిన్నారులకు జ్యోతీరావు పూలే జయంతిని పురస్కరించుకొని అల్పహారం , స్వీట్లు పంచి పెట్టారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, మనోజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వెంకటాచలం: మండలంలోని గొలగమూడి సమీపంలో ఉన్న మహాత్మ జ్యోతిరావుపూలే బాలి కల గురుకుల పాఠశాలలో గురువారం జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసం దర్భంగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ల ర్పించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దమ్ము కొండలరావు, వైస్ ప్రిన్సిపాల్ సుజాత, అపర్ణ, మురళీ బాబు, ఉపాధ్యాయ బృందం తదిత రులున్నారు.

కస్తూర్బాగాంధీ జయంతి

ఇందుకూరుపేట, ఏప్రిల్ 11 : మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో గురువారం కస్తూర్బాగాంధీ జయంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముందుగా కమిటీ సభ్యులు గంపల మంజుల కస్తూర్బాగాంధీ చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో గాంధీ ఆశ్రమ మేనేజర్ మనోజ్, స్కూల్ విద్యార్థులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

శివాలయానికి ట్రాలీ వితరణ



మనుబోలు, ఏప్రిల్ 11: స్థానిక శ్రీ కామాక్షితాయి బ్రహ్మేశ్వరస్వామి ఆలయానికి బొమ్మిరెడ్డి సోదరులు నూతన ట్రాలీని గురువారం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, మధురెడ్డి, ధనుంజయరెడ్డిలు పాల్గొన్నారు.



వెంకటాచలం : టీడీపీలో చేరిన వారితో మాజీ మంత్రి సోమిరెడ్డి

నా జీవితం సర్వేపల్లికి అంకితం : సోమిరెడ్డి

పొదలకూరు, ఏప్రిల్ 11 : నలభై ఏళ్ల రాజకీయ జీవిత చరిత్రలో ఒకే పార్టీలో ఉంటూ ఎన్ని ఆటుపోటులు వచ్చినా జీవితాన్ని సర్వేపల్లికి అంకితం చేసినట్లు మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అంకుపల్లి, ఎస్సీ కాలనీలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్ట ప్రాంతమైన పొదలకూరు మండలానికి తాగు, సాగునీటికి కొరత లేకుండా చేశామన్నారు. సీఎం జగన్ ఐదేళ్లలో రాష్ట్రాన్ని, నియోజకవర్గాన్ని అతలాకుతలం చేశారన్నారు. అనంతరం పార్టీలో చేరిన కొన్ని కుటుంబాల వారిని పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు తలచీరు మస్తాన్‌బాబు, కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, పిచ్చినాయుడు, సుబ్బానాయుడు, రాఘవులు,పాల్గొన్నారు.

● 80 కుటుంబాలు టీడీపీలో చేరిక

వెంకటాచలం: నెల్లూరులోని వేదాయపాళెంలో ఉన్న సోమిరెడ్డి కార్యాలయంలో గురువారం మండలంలోని తిక్కవరప్పాడు, రామదాసుకండ్రిగ, కసుమూరు పంచాయతీ వడ్డీపాళెం గ్రామాలకు చెందిన 80 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరందరికీ సోమిరెడ్డి పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గుమ్మడి రాజాయాదవ్, వల్లూరు రమేష్‌నాయుడు, మేదరమెట్ల కోదండయ్యనాయుడు, కందిమళ్ల వెంకటేశ్వర్లునాయుడు, మందల హరికృష్ణ తదితరులున్నారు.

● తండ్రి కోసం కుమార్తె ప్రచారం

మండలంలోని ఈదగాలి పంచాయతీలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కుమార్తె డాక్టర్ సోమిరెడ్డి సింధురెడ్డి ప్రచారం నిర్వహించారు. గురువారం ఆమె తన మేనత్త కట్టంరెడ్డి సంయుక్తమ్మ, మేనమావయ్య కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డిలతో కలిసి ఇంటింటికి వెళ్లి తన తండ్రికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చల్లా నాగార్జున్‌రెడ్డి, దువ్వూరు లక్ష్మమ్మ, హరిరెడ్డి, బెల్లంకొండ కిష్టమ్మ, గునయ్య, సుధాకర్, కిష్టయ్య తదితరులున్నారు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గెలవాలని కోరుతూ టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ అడవిలోని శివాలయంలో పాలభిషేకం నిర్వహించి పూజలు చేపట్టారు.

● తెలుగుదేశంలో చేరికలు

మనుబోలు: మండలంలోని చెరుకుమూడి పంచాయతీకి చెందిన 15 వైసీపీ కుటుంబాలు టీడీపీ నాయకులు మేడికొండ శ్రీహరినాయుడు, దొడ్డపనేని రాజానాయుడు ఆధ్వర్యంలో గురువారం మాజీ మంత్రి సోమిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వద్దినేని మస్తాన్‌నాయుడు, మేడికొండ రామానాయుడు, రామయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వంతోనే మహిళలకు రక్షణ

సైదాపురం, ఏప్రిల్ 11 : మండల పరిధిలోని పోతేగుంటలో మండల టీడీపీ అధ్యక్షుడు కట్టా మోహన్‌కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గురువారం శంఖారావం-బాబు సూపర్-6 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెంచలకోన ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ తానంకీ నానాజీ పాల్గొని ఇంటింటికీ వెళ్ళి టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సూపర్-6 పథకాలను వివరించి కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంతోనే మహిళలకు రక్షణ అని, వెంకటగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయి ప్రియను అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీలకు న్యాయం

మనుబోలు, ఏప్రిల్ 11: టీడీపీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని సీనియర్ బీసీ నాయకుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర అన్నారు. మండలంలోని మడమనూరులో జయహో బీసీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బొమ్మి మాట్లాడుతూ బీసీలంతా ఏకమై సర్వేపల్లిలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని, ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడును గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా నాయకులు పొన్నూరు రామకృష్ణయ్య, మండలాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి,ఉడతా విజయ్‌కుమార్, సుధీర్, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

సమానత్వం అలవర్చుకోవాలి

ఎన్డీఏ కోవూరు అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



కొడవలూరులో ప్రార్థనలు చేస్తున్న ప్రశాంతి రెడ్డి



ఇందుకూరుపేటలో కరపత్రాలు పంచుతున్న నీలిమారెడ్డి

కొడవలూరు ఏప్రిల్ 11: సమాజంలో ప్రతి ఒక్కరూ అన్ని మతాలను గౌరవిస్తూ సర్వమత సమానత్వం అలవర్చుకోవాలని ఎన్డీఏ కూటమి కోవూరు అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. రంజాన్ సందర్భంగా గురువారం కొడవలూరులోని దర్గాలో ముస్లింలతో కలిసి ఆమె ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ స్నేహానికి ప్రతీక రంజాన్ అన్నారు. ఆ అల్లా దయతో మీరు కోరుకున్న కోరికలు తీర్చాలని ఆ భగవంతుడ్ని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. అనంతరం దర్గా సమీపంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, వడ్డించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కె విజయభాస్కర్‌రెడ్డి, కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, జి శేఖర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, బద్వేల్ వినీల్‌కుమార్‌రెడ్డి, జిలానిబాషా, నాయబ్, సంషీర్ తదితరులు పాల్గొన్నారు.

● నాయుడుపాళెం గ్రామంలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోడలు ఐషికరెడ్డి ప్రచారంలో పాల్గొన్నారు. నీటి సంఘం మాజీ అధ్యక్షుడు మాగుంట సతీష్, టీడీపీ నాయకులు పల్లంరెడ్డి సురేష్‌రెడ్డి, టీడీపీ యువ నాయకుడు మాగుంట అజేయ్‌రెడ్డి, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

● తల్లి కోసం తనయ ప్రచారం

ఇందుకూరుపేట : తన తల్లిని గెలిపించాలని కోరుతూ ప్రశాంతిరెడ్డి కుమార్తె నీలిమా రెడ్డి పల్లెపాడులో ప్రచారం చేశారు. గ్రామంలో ప్రతి ఇంటికీ తిరిగి తెలుగుదేశం ప్రభుత్వం రాగానే చేసే అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చెంచుకిషోర్ యాదవ్, నెల్లూరు రవీందర్‌రెడ్డి, చింతపంటి వెంకటరణమయ్య, బీజేపీ నాయకులు కైలాసం శ్రీనివాసులురెడ్డి, పెంచలయ్య, శీనయ్య తదితరులు పాల్గొన్నారు

పిచ్చి విమర్శలు తగదు!

బుచ్చిరెడ్డిపాళెం : 40 ఏళ్ల రాజకీయ చరిత్ర కలిగిన ప్రతిపక్ష నాయకులు తనను ఎదుర్కోలేక ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం, ఎచ్చి పిచ్చి విమర్శలు చేయడం, మైకు దొరికిందని సంస్కారం లేని ఉపన్యాసాలు ఇవ్వడం ఇది రాజకీయం కానేకాదని కోవూరు ఎన్డీఏ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. గురువారం రేబాల పంచాయతీలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో కలిసి ఆమె ప్రచారం చేశారు. ప్రజలే దేవుళ్ళుగా నమ్మిన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి, తనకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎర్రంరెడ్డి గోవర్దన్‌రెడ్డి, శివరామకృష్ణారెడ్డి, సూరా శ్రీనివాసులురెడ్డి, హరికృష్ణ, మురళి, కత్తి మహేష్, పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

● బుచ్చిరెడ్డిపాళెం కొత్త బస్టాండ్ (పెద్దూరు) మసీదులో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. మసీదులో పలు అభివృద్ధి పనుల గురించి మత పెద్దలు ప్రస్తావించగా, అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. పెనుబల్లి గ్రామంలో వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరుతూ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు.

విడవలూరు: రంజాన్ పండుగని పురస్కరించుకుని ముదివర్తి గ్రామంలోని మసీదులో కోవూరు ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గెలవాలంటూ ముస్లింలు గురువారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

జ్యోతిరావుపూలే గొప్ప సంఘ సంస్కర్త : జేసీ



జ్యోతిరావుపూలేకు నివాళులర్పిస్తున్న జేసీ సేతు మాధవన్

నెల్లూరు(వీఆర్సీ), ఏప్రిల్ 11: సమాజంలో అందరికీ సమాన హక్కులు లభించాలని సమసమాజ స్థాపనకు కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త, మానవతావాది మహాత్మ జ్యోతిరావుపూలే అని జాయింట్ కలెక్టర్ సేదుమాధవన్ కొనియాడారు. పూలే 198వ జయంతి సందర్భంగా నగరంలోని మినీ బైపాస్ రోడ్డులోని పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జ్యోతిరావుపూలే సతీమణి సావిత్రిబాయిపూలే మహిళల విద్యకోసం ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, సెట్నెల్ మేనేజరు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



పూలేకు నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు



పూలేకు నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో...

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కనకట్ల రఘురామ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో దద్దోలు రమణయ్య, వెంకటకృష్ణయ్య, సత్యనారాయణ, బలరామయ్య, అనంత రామారావు, తలారి బాలసుధాకర్‌రావు, కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

పూలే జీవితం భావితరాలకు మార్గదర్శకం : టీడీపీ

నెల్లూరు(విద్య) : పూలే జీవితం భావితరాలకు మార్గదర్శకమని టీడీపీ నేతలు తెలిపారు. నగరంలోని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, పొంగూరు నారాయణ, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అబ్దుల్‌జజీజ్, అబ్దుల్ జలీల్ పాల్గొన్నారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బీటీఏ ఆధ్వర్యంలో..

బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూలే విగ్రహం వద్ద ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పల్లం వేణుగోపాల్, జిల్లా ప్రధానకార్యదర్శి మాసా ప్రసాద్, నాయకులు ఆదినారాయణ, మాల్యాద్రి, మనోజ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే కొండాయపాళెం నగరపాలక ప్రాథమిక పాఠశాలలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి హెచ్ఎం ఎం.భాస్కర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో...

నెల్లూరు(వైద్యం) : నగరంలోని మినీబైపాస్ రోడ్డులో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి సీపీఎం ఆధ్వర్యంలో ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి వీ.శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో...

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్ జ్యోతిరావు పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ సుబ్రహ్మణ్యం నర్సింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారులు సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వృత్తిదారులు కమిటీ జిల్లా కన్వీనర్ కటికాల వెంకటేశ్వర్లు, మత్స్యకార్మిక సంఘం జిల్లా నేత వెంకటేశ్వర్లు, వడ్డెర సంఘం జిల్లా నేత బెల్లంకొండ బాల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(సాంస్కృతికం) : న్యాయవాది ఈ.వెంకటరమణయ్య తన కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులఅర్పించారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

అల్లా దీవెనలు ప్రజలపై ఉండాలి



నెక్లెస్‌రోడ్డును పరిశీలిస్తున్న నారాయణ

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 11 : అల్లా దీవెనలు ప్రజలందరిపై ఉండాలని మాజీ మంత్రి, నెల్లూరు నగర టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలు తెలిపారు. పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని బారాషహీద్ దర్గాలో గురువారం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మత పెద్దలు దివ్య ఖురాన్ సూత్రాలను ఆలపించి పండుగ సందేశాన్ని వినిపించారు. అనంతరం ముస్లిం మత పెద్దలు, మైనార్టీ నేతలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వారు మాట్లాడుతూ ప్రజల కోరికలు, బాధలు భగవంతుడు తీర్చాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్, మత పెద్దలు, మైనార్టీ నేతలు పాల్గొన్నారు. అలాగే నగరంలోని 13, 16వ డివిజన్‌లలో పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. 10వ డివిజన్‌లో నారాయణ కుమార్తె శరణి ప్రచారం నిర్వహించి ఒక్క ఛాన్స్ పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన జగన్‌కు సరైనరీతిలో బుద్ధి చెప్పి తెలుగుదేశం పార్టీని ఆదరించాలన్నారు.

అధికారంలోకి రాగానే నెక్లెస్‌రోడ్డు పూర్తి...

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే నెక్లెస్‌రోడ్డును పూర్తి చేస్తానని పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలోని ఇరుకళలపరమేశ్వరి దేవస్థానం వద్ద ఉన్న ఎన్టీఆర్ నెక్లెస్‌రోడ్డును ఆయన పరిశీలించి మాట్లాడారు. కక్షపూరిత రాజకీయాలతోనే ఈప్రాంతాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేయడం బాధాకరమన్నారు. త్వరలో రానున్న ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వాన్ని గెలిపిస్తే ఆగిపోయిన పనులన్నీ పూర్తి చేస్తామన్నారు. నెక్లెస్‌రోడ్డును నెల్లూరుకే తలమానికంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నేతలు పాల్గొన్నారు. అలాగే 9వ డివిజన్‌లోనూ నారాయణ ప్రచారం చేశారు.

టీడీపీలో చేరిన ఆర్య క్షత్రియులు

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 11 : ఆర్య క్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసవర్మ వైసీపీని వీడి టీడీపీలో చేరారు. గురువారం నెల్లూరు పార్లమెంటు టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో ఆయన నివాసంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి వేమిరెడ్డి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉమాశ్యాం, సాయి ప్రసాద్, భార్గవ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల ప్రచారం

నెల్లూరు(వైద్యం) : నెల్లూరు సిటీ సీపీ ఎం అభ్యర్థి మూలం రమేష్‌ను గెలిపించాలని కోరుతూ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ.శ్రీనివాసరావు, జిల్లా నాయ కులు గురువారం నగరంలోని 6వ డివిజన్ శెట్టిగుంట రోడ్డు ప్రాంతంలో ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థి మూలం రమేష్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్, సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, సీఐటీయూ నగర కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ కథా తరంగిణి సప్తాహం ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం) : శ్రీరామ నవమి పురస్కరించుకుని గురువారం రేబాలవారివీధిలోని పీజీ టవర్స్‌లో శ్రీరామ కథా తరంగిణి సప్తాహం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాలు ఈనెల 13వ తేదీ వరకు జరగనున్నాయి. తొలిరోజు సహస్రవధాని కోట రాజశేఖర్ రామాయణంలోని బాలకాండ ప్రవచనం చేశారు. అనంతరం పీజీ టవర్స్ కార్యదర్శి భైతాని జ్యోతిప్రసాద్ అవధానిని సత్కరించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షుడిగా ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ చైర్మన్ ప్రభాకర్‌నాయుడు వ్యవహరించారు. ఈ కార్యక్రమాలను పద్య సారస్వత పరిషత్ అధ్యక్షుడు లక్ష్మీనరసింహారావు, కార్యదర్శి డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వరరావు, కోశాధికారి సూరం చంద్రశేఖర్ తదితరులు పర్యవేక్షించారు.

ఆర్టీసీ అద్దె బస్సులో మంటలు

నెల్లూరు(క్రైం) : నగరంలోని కస్తూరిదేవి స్కూల్ ఎదురుగా నిలిపి ఉన్న ఆర్టీసీ అద్దె బస్సులో గురువారం రాత్రి మంటలు వ్యాపించాయి. సేకరించిన సమాచారం మేరకు.. కస్తూరిదేవి స్కూల్ ఎదురుగా రోడ్డుపై ఆర్టీసీ అద్దె బస్సును నిలిపి ఉన్నారు. ఆ బస్సులో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

గ్రూప్-2లో ఓవెల్ అకాడమీ ప్రతిభ

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 11 : గ్రూప్-2 ఫలితాల్లో ఓవెల్ ఐఏఎస్ అకాడమీ విద్యార్థులు పీ.శశికుమార్, ఎస్‌కే.సాహిల్ విజయం సాధించారని విద్యా సంస్థల డైరెక్టర్ వేణు ఒక ప్రకటనలో తెలిపారు. తమ అకాడమీలో ముగ్గురు విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా ఇద్దరు ఎంపికవడం ఆనందంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు మరిన్ని విజయాలు సాధిస్తామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు



నవాజ్‌ఖాన్ ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 11 : పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలు ముగియడంతో గురువారం ఈద్ ఉల్ ఫితర్ (రంజాన్) పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నగరంలోని 39 మసీదులు, దర్గాలలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. ప్రజలు సుఖసంతోషాలతో జీవించేందుకు అల్లాహ్ కరుణ చూపాలని వేడుకుంటూ నమాజ్‌లు దువాలు చేశారు. నగరంలోని బారాషహీద్ దర్గా మైదానంలో జరిగిన సామూహిక ప్రార్థనల్లో, ఇమామ్ ఓ ఖతీజ్ సయ్యద్ అబూబకర్ సాఖరి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఉదయం 6.30గంటల నుంచి 12గంటల వరకు ఈద్ ఉల్ ఫితర్ ప్రార్థనలు జరిగాయి. జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో అన్ని మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక భద్రత ఏర్పాట్లు జరిగాయి. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ బారాషహీద్ దర్గాలో ప్రార్థనలు చేసి విధి నిర్వహణలో పాల్గొన్నారు. నగరంలోని చిన్నబజార్ మెయిన్‌రోడ్డులో ఖాజాపీర్, బందనవాజ్ దర్గాలో రంజాన్ వేడుకలు జరిగాయి. బందనవాజ్ సాహెబ్ పీఠాధిపతి ఎస్ఎస్, బాబా రంజాన్ ప్రవచనం, నమాజ్‌లు చేయించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనాలు చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

నెల్లూరు(హరనాథపురం) : నగరంలోని నవాజ్‌ఖాన్ ఈద్గాలో రంజాన్ నెలను పురస్కరించుకొని ముస్లింలు భారీ సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు చేశారు.

ముస్లింలపై వైసీపీ ప్రభుత్వం చిన్నచూపు

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి



ప్రచారం చేస్తున్న కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 11 : వైసీపీ ప్రభుత్వం ముస్లింలను చిన్న చూపు చూస్తుందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసుల రెడ్డి విమర్శించారు. గురువారం 15వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పేద ముస్లింలకు రంజాన్ తోఫా ఇవ్వలేని స్థితిలో రాష్ట్ర ప్రభు త్వం ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ప్రతి ముస్లిం కుటుంబానికి రంజాన్ తోఫా అందించామని చెప్పారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే అవ్వా తాతలకు రూ. 4వేల ఫించను అందిస్తారని తెలిపారు. నెల్లూరు నగరంలో షాదిమంజిల్, గోషామహల్‌కు పొంగూరు నారాయణ శ్రీకారం చుట్టారన్నారు. నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా అభ్యర్థిగా పొంగూరు నారాయణకు, నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించు కోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కేపీ చౌదరి, కమ్మ కల్యాణి, ఫిరోజ్, సురేష్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మేమంతా జనసేనలోనే..



మేమంతా జనసేనలోనే అంటున్న నాయకులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 11 : వ్యక్తిగత ప్రయోజనాల కోసం జనసేన నాయకులని చెప్పుకొని పార్టీని వీడి వెళుతున్న మనుక్రాంత్ రెడ్డి వెంట ఆయన నీడ తప్ప జనసేన క్యాడర్ ఎవరూ తోడురారని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గును కుల కిషోర్ అన్నారు. నగరం లోని మాగుంట లేఅవుట్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో గురువారం జనసేన నాయకులు, పవన్‌కళ్యాణ్ అభిమానులు, చిరంజీవి యువత నాయ కులు ఉమ్మడిగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ పార్టీలో కొనసాగుతూ కూటమి అభ్యర్థుల విజయకోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు సుందరరామిరెడ్డి, నాగరత్నం యాదవ్, కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ మారడం మనుక్రాంత్ వ్యక్తిగతం

జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తోనే తమ ప్రయాణం కొనసాగుతుందని, పార్టీ మారడం మనుక్రాంత్ వ్యక్తిగత నిర్ణయమని ఆ పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు చెప్పారు. నగరంలోని ఏసీ నగర్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మనుక్రాంత్‌రెడ్డి రాజీనామాతో పార్టీకి ఎలాంటి నష్టం లేదన్నారు.

షార్‌కు చేరిన రాకెట్ పరికరాలు



శ్రీహరికోటలోని అంతరిక్ష ప్రయోగ కేంద్రం షార్ నుంచి ఈ ఏడాది భారీ ప్రయోగాలు చేపట్టేందుకు ఇస్రో సన్నాహాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా వాహక నౌకలకు వినియోగించే పరికరాలను గురువారం రాత్రి ఇస్రో ప్రధాన కేంద్రమైన బెంగళూరు నుంచి షార్‌కు తీసుకొచ్చారు. బెంగళూరు నుంచి రోడ్డుమార్గాన ప్రత్యేక వాహనంలో సీఐఎస్ఎఫ్, పోలీసుల భద్రత నడుమ షార్ లోపలకు తీసుకెళ్లారు. ఈ వాహనంలో రాకెట్‌కు వాడే పరికరాలతో పాటు ఇంధన తయారీకి వినియోగించే మిక్స్‌డ్ ప్రాజెక్టుకు సంబంధించిన చిన్న ట్యాంకులు కూడా ఉన్నాయి. గగన్‌యాన్ వంటి భారీ ప్రయోగాలకు వాడే పరికాలు కూడా ఇందులో ఉన్నట్లు తెలిసింది.

- సూళ్లూరుపేట

రంజాన్ ప్రార్థనల్లో వైసీపీ అభ్యర్థి ప్రచారం

నాగలాపురం ఏప్రిల్ 11: నాగలాపురం ఈద్గాలో జరిగిన రంజాన్ ప్రార్థనల్లో సత్యవేడు వైసీపీ అభ్యర్థి నూకతోటి రాజేష్ పాల్గొని హామీలివ్వడం చర్చనీయాంశమైంది. సత్యవేడు నియోజకవర్గం నుంచి తనను ఎమ్మెల్యేగా ఎటూ కచ్చితంగా గెలిపిస్తారని చెబుతూ తాను గెలిచిన తరువాత ఈద్గాకు కాంపౌండ్ వాల్ నిర్మిస్తానని హామీ ఇచ్చారు. నాగలాపురంలోని ముస్లింలు తమకు శ్మశాన వాటిక, ఈద్గాలకు స్థలాన్ని కేటాయించాలని ఎప్పట్నుంచో కోరుతున్నారు.ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు స్థానిక పాత జూనియర్ కాలేజి సమీపంలో శ్మశాన స్థలాన్ని కేటాయిస్తూ పట్టా మంజూరు చేశారు.ఫిబ్రవరిలో మంజూరైన ఆ పట్టాను మాత్రం వారికివ్వనేలేదు.ఈ నేపథ్యంలో స్థానిక వైసీపీ నాయకులు ఎన్నికల వేళ రాజకీయ డ్రామాకు తెరలేపారు. శ్మశాన వాటిక కోసం కేటాయించిన ఆ స్థలాన్ని ఈద్గా కోసం కేటాయిస్తున్నట్లు, అదికూడ వైసీపీ అభ్యర్థి చొరవతోనే ఈ స్థలం మంజూరైనట్లు కలరింగ్ ఇచ్చుకున్నారు. దీంతో రాజేష్‌ను పిలిపించి ప్రార్థనల్లో కూర్చోబెట్టి, గెలిస్తే కాంపౌండ్ వాల్ నిర్మిస్తానన్న హామీని ఇప్పించారు. ఈద్గా స్థల విషయమై స్థానిక వీఆర్వో నాగభూషణాన్ని వివరణ కోరగా.... నాగలాపురంలో ఈద్గాకు ఎలాంటి స్థలం కేటాయించలేదని, శ్మశాన స్థలం మాత్రమే కేటాయించినట్లు తెలిపారు.



ముస్లింలనుద్దేశించి మాట్లాడుతున్న నూకతోటి రాజేష్

సీఈవో గారూ... ఫిర్యాదులపై చర్యలేవీ?

• నేడు తిరుపతిలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి పర్యటన

తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో వెలుగు చూసిన అక్రమాలపైన దర్యాప్తు నత్తనడకన సాగుతోంది. పాత్రధారుల్లో కొందరు సస్పెండ్ కాగా సూత్రధారులెవరన్నది దర్యాప్తు అధికారులు ఇంకా తేల్చలేదు. దీంతో అధికారులతో అక్రమాల ఆట ఆడించిన తెర వెనుక వ్యక్తులు దర్జాగా తిరుగుతున్నారు. అప్పటి ఎన్నికల్లో అక్రమాలకు అవకాశమిచ్చిన ఓటర్ల జాబితాలోని 38 వేల ఆబ్సెంట్ ఓటర్ల పేర్లు ఇంకా తొలగించనే లేదు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి నియోజకవర్గాలలో పలు అవకతవకలు, ఉల్లంఘనలు చోటు చేసుకున్నాయి. దీనిపై అసంఖ్యాకంగా ఈసీకి ఫిర్యాదులందాయి.ఈ మూడు నియోజకవర్గాల పరిధిలో పనిచేస్తున్న పలువురు అధికారులపై నేతల నుంచీ ఆరోపణలు వస్తుండగా జనంలోనూ అనుమానాలున్నాయి. రేణిగుంటలో ఇటీవల పట్టుబడిన ఎన్నికల తాయిలాలకు సంబంధించి అధికారులు దాగుడుమూతలాడుతున్నారు. టీటీడీ పాలక మండలి ఛైర్మన్ మీద, ఈవో మీద అనేక ఆరోపణలు, ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా ఇంతవరకూ ఎలాంటి చర్యలూ లేవు.ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం తిరుపతికి చేరుకున్న రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లపై కాసేపు అధికారులతో సమీక్షించారు.శుక్రవారం మహిళా వర్సిటీలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఆయన పరిశీలించనున్నారు. అనంతరం పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేయనున్నారు. తరువాత సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై జిల్లా అధికారులతో సమీక్షించనున్నారు.ఈ సందర్భంగా జిల్లాలో కొంతకాలంగా సంభవించిన ఘటనలు, తాజా పరిణామాలపై ఆయన దృష్టి సారిస్తారని రాజకీయ వర్గాలతో పాటు జిల్లా ప్రజానీకం కూడా ఆశిస్తున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఓటర్ల జాబితా నుంచీ తొలగని 38 వేల ఓటర్ల పేర్లు

తిరుపతి ఉప ఎన్నికల్లో స్థానికంగా నివాసం లేని 38 వేల ఓటర్లను అధికార పార్టీ నేతలు గుర్తించి వారి పేరిట అక్రమాలకు పాల్పడిన నేపథ్యంలో ఆ పేర్లను ఇంతవరకూ జాబితా నుంచీ తొలగించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఈసీ ఓటర్ల జాబితాలో ఈ 38 వేల ఓటర్లనూ గుర్తించింది. ఆ వివరాలు పూర్తిగా ఈసీ వద్ద వున్నాయి. వారు వాస్తవంగా ఓటర్లా, తిరుపతిలోనే నివాసముంటున్నారా అన్నది తేల్చడం పెద్ద సమస్య కాదు. బీఎల్వో స్థాయి నుంచీ ప్రభుత్వానికి విస్తృత యంత్రాంగం వుంది. బూత్ స్థాయిలో బీఎల్వో పరిశీలిస్తే తేలిపోతుంది. అదీ కాకుంటే ఆ ఇంటి అడ్రసుతో నోటీసులు పంపితే ఓటర్లు స్వీకరించి సమాధానం ఇవ్వాలి.ఆ ప్రక్రియలోనూ వాస్తవాలు తేలుతాయి. అయితే ఈ ఓటర్ల ఆచూకీ లేదని సమాచారం. అంటే నిజంగా వారు తిరుపతి నుంచీ ఇతర ప్రాంతాలకు వెళ్ళిపోయి వుండాలి. ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు తరలిపోయి వుండాలి. అది కాదంటే అధికార పార్టీ నేతలు చేర్పించిన దొంగ ఓటర్లయినా వుండాలి. ఇందులో ఏ ఒక్కటి నిజమైనా ఆ పేర్లను జాబితా నుంచీ తొలగించాలి. ఈ విషయంలో జిల్లా యంత్రాంగం నోరు మెదపడం లేదు. ఇంత జరిగినా ఆ పేర్లు జాబితాలో కొనసాగుతుంటే ఈసీ మార్గదర్శకాలకు అర్థమే లేదు.



తిరుచానూరు పద్మావతీ దేవి దర్శనానంతరం ఆలయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా దంపతులు

రేణిగుంటలో పట్టుబడిన తాయిలాలపై దాగుడుమూతలు

రేణిగుంటలో ఇటీవల నాలుగు ప్రైవేటు గోదాముల్లో రూ. కోట్ల విలువైన వైసీపీ ప్రచార సామగ్రి పట్టుబడింది. దానిపై పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. అయితే ఈ వ్యవహారం కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా మారింది. పట్టుబడిన వైసీపీ ప్రచార సామగ్రిలో చంద్రగిరి నియోజకవర్గానికి చెందిన ఇద్దరు అధికార పార్టీ నేతల ఫొటోలు, పేర్లతో కూడిన పలు వస్తువులు లభించాయి. అవన్నీ ఓటర్లకు పంపిణీ చేయాల్సిన తాయిలాలు. పార్టీ ప్రచార సామగ్రి అంటే పార్టీ చిహ్నాలతో కూడిన జెండాలు, టోపీలు, బ్యానర్లు, స్టిక్కర్లు వుంటాయి. అంతవరకూ అభ్యంతరం లేదు. కానీ మహిళలు పెట్టుకునే బొట్టు బిళ్ళలు, చీరలు, రిస్టు వాచీలు, లౌడ్ స్పీకర్లు, వాటి స్టాండ్లు వంటివి నిస్సందేహంగా ఓటర్లకు పంపిణీ చేసేందుకు ఉద్దేశించినవే. స్పీకర్లు సాధారణంగా ఆలయాలకు, చర్చిలకు, మసీదులకు అందజేసేవి. ఇవన్నీ తాయిలాలే. నేతల ఫొటోలు, పేర్లు వాటిపై వున్నా సదరు నేతలపై కేసులు నమోదు కాలేదు. కనీసం నోటీసులు కూడా జారీ చేయలేదు. గోదాములను అద్దెకు తీసుకున్నది కూడా అధికార పార్టీ అవసరాల కోసమే. నేతలను వదిలిపెట్టి గోదాముల నిర్వాహకులపై కేసు పెట్టి చేతులు దులుపుకున్నారు.

టీటీడీ ఛైర్మన్, ఈవోల మీద ఫిర్యాదుల వెల్లువ

సార్వత్రిక ఎన్నికల వేళ టీటీడీ పాలకమండలి ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డిపై, ఈవో ధర్మారెడ్డిపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల్లో అధికార పార్టీకి అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారనేది వారిపై ప్రధాన ఆరోపణ. ఛైర్మన్ కుమారుడు అభినయ్‌రెడ్డి తిరుపతిలో అధికార పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నేపథ్యంలో అతడికి అనుకూలంగా ఇటీవలి కాలంలో పలు నిర్ణయాలు తీసుకున్నారని ఇప్పటికే బీజేపీ, జనసేన, టీడీపీ నేతలు కేంద్ర, రాష్ట్ర ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు చేశారు. టీటీడీకి చెందిన వేలాదిమంది ఉద్యోగులు,వారి కుటుంబీకులు తిరుపతి నియోజకవర్గంలో ఓటర్లుగా వున్న సంగతి తెలిసిందే. ఐదువేల మందికి పైగా ఉద్యోగులకు ఇళ్ళ స్థలాల కేటాయింపు, మరికొన్ని వేలమందికి వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత కల్పించడం వంటి నిర్ణయాలు తీసుకున్నారు. అలాగే టీటీడీ నిధులతో నగరంలో రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఇవన్నీ నగర ఓటర్లను ప్రభావితం చేసేవే. కరుణాకర్‌రెడ్డి, ధర్మారెడ్డి తమ పదవి, ఉద్యోగాలను అడ్డం పెట్టుకుని అధికార పార్టీకి అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడాన్ని అడ్డుకోవాలని, వారిని ఆయా స్థానాల నుంచీ తొలగించాలని ఈసీకి ఫిర్యాదులు అందుతున్నాయి. టీటీడీ ఉద్యోగులు పలువురు అధికార పార్టీ అభ్యర్థి ఎన్నికల ప్రచారంలో బహిరంగంగా పాల్గొన్నా చర్యల్లేవు.

తిరుపతి ఉప ఎన్నికల అక్రమాలపై నత్తనడకన దర్యాప్తు

తిరుపతి లోక్‌సభ నియోజకవర్గానికి 2021లో జరిగిన ఉప ఎన్నికల్లో పలు అక్రమాలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించి ఓటర్ల జాబితాలో స్థానికంగా నివాసం లేని 38 వేల మంది ఓటర్లను గుర్తించి అధికార పార్టీ నేతలు కొందరు భారీ అక్రమానికి పాల్పడ్డారు. అందులో 35 వేల ఓటరు కార్డులను అక్రమంగా డౌన్‌లోడ్ చేశారు. వాటికి డూప్లికేట్ కార్డులు తయారుచేశారు. అందులో ఓటరు ఫొటోలు మార్చారు. వాటి సాయంతో దొంగ ఓట్లు భారీగా వేయించారు. ఫిర్యాదులు రావడంతో స్పందించిన ఈసీ విచారణ జరపగా నిజమని తేలింది. ఐఏఎస్ అధికారి సహా పలువురు దిగువ స్థాయి అధికారులు సస్పెండయ్యారు. క్రిమినల్ కేసు కూడా నమోదైంది. కాకపోతే ఈ అక్రమానికి అసలు కారకులెవరన్నది బహిరంగ రహస్యమైనా వారిని బాధ్యులుగా గుర్తించే దిశగా దర్యాప్తు సాగలేదు. అర్థాంతరంగా ఆగిపోయింది. దీంతో బాధ్యులైన అసలు వ్యక్తులు దర్జాగా ప్రజా జీవితం గడుపుతున్నారు.

చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి అధికారులపైనా ఆరోపణలు, అనుమానాలు

చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల పరిధిలో కింది స్థాయి ఉద్యోగులు మొదలుకుని పై స్థాయి అధికారుల వరకూ పలువురిపై ఆరోపణలు, అనుమానాలు వున్నాయి. వారంతా అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనేది ప్రధాన ఆరోపణ. అధికార పార్టీ నేతల ఒత్తిడితో ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులకు అడ్డంకులు సృష్టిస్తున్నారని, వైసీపీ నేతల కోడ్ ఉల్లంఘనలను చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని వీరిపై ఫిర్యాదులు అందుతున్నాయి. ఓటర్ల జాబితాలలో తప్పులను సరిదిద్దాలని ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా బీఎల్వోల నుంచీ ఈఆర్వోల దాకా పట్టించుకోలేదనే ఆరోపణలున్నాయి.జిల్లా పర్యటనలో వున్న సీఈవో ముఖేష్ కుమార్ మీనా వీటన్నింటిపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాల్సి వుంది. లేనిపక్షంలో ఈసీ నిబంధనలకు, మార్గదర్శకాలకు అర్థమే లేకుండా పోతుందన్న అభిప్రాయం జనంలో ఏర్పడే ప్రమాదముంది.

అంగన్‌వాడీ కార్యకర్తపై వైసీపీ శ్రేణుల దాడి



తనపై దాడికి ఉపయోగించిన రోకలిబండను చూపుతున్న బేబి షాలిని

తొట్టంబేడు, ఏప్రిల్ 11: అంగన్‌వాడీ కార్యకర్తపై వైసీపీ కార్యకర్తలు దాడి చేసిన సంఘటన శ్రీకాళహస్తి మండలంలోని ఎంపేడు గ్రామం ఈశ్వరయ్య కాలనీలో గురువారం చోటుచేసుకుంది.బాధితురాలు బేబి షాలిని,ఆమె సోదరి విజయమ్మ కథనం మేరకు.... ఏర్పేడు మండలం చింతలపాళెం గ్రామం మరాఠీపురం నక్కలకాలనీలో అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న బేబి షాలిని ఈశ్వరయ్య కాలనీలో వుంటున్న తల్లిదండ్రుల వద్ద కుమారుడితో ఉంటోంది.వైసీపీ ప్రభుత్వం అంగన్‌వాడీలకు చేసిన అన్యాయంపై అప్పుడప్పుడూ బంధువులతో మాట్లాడేది.దీంతో ఆమెను టీడీపీ సానుభూతిపరురాలిగా భావించిన వైసీపీ కార్యకర్తలు శత్రు భావంతో వుండేవారు. గురువారం బేబి షాలిని ఒంటరిగా ఇంటి వద్ద వుండడం గమనించి డబ్బారాధిక, రానానవిత, డబ్బా చరణ్, కొండి, సారయ్య తదితరులు 20మందికి పైగా విచక్షణారహితంగా దాడి చేసి గాయపరిచారు.ప్రస్తుతం బేబి షాలిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.ఈ విషయమై శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్‌ని అడగ్గా వారంతా బంధువులేనన్నారు. దాడిలో ఇరువర్గాలకూ గాయాలైనట్లు పేర్కొన్నారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రంజాన్ ప్రార్థనల్లోనూ రాజకీయం

- చిత్తూరులో వైసీపీ అభ్యర్థి ప్రచార ప్రసంగం
- టీడీపీ నేతలకు మైక్ ఇవ్వకుండా ఆగడం



ఈద్గా వద్ద వైసీపీ తీరుతో రెండు వర్గాల మధ్య తోపులాట

చిత్తూరు, ఏప్రిల్ 11: చిత్తూరులోని ఈద్గాలో గురువారం జరిగిన రంజాన్ ప్రార్థనలో వైసీపీ నేతలు రాజకీయం చేశారు. ఆ పార్టీ అభ్యర్థి విజయానంద రెడ్డి మైక్ తీసుకుని దాదాపుగా ఎన్నికల ప్రచారంలా ప్రసంగించారు. అప్పటి వరకు దూరంగా ఉన్న టీడీపీ నేతలంతా స్టేజీ వద్దకు వచ్చి తమకూ మాట్లాడేందుకు మైక్ ఇవ్వాలని కోరారు. ఆ వెంటనే వైసీపీ కార్యకర్తలు మైకు దాచేశారు. కనెక్షన్‌ను కట్‌చేశారు. వైసీపీ అభ్యర్థికి మాట్లాడేందుకు అవకాశం కల్పించినవారు తమకు ఎందుకు ఇవ్వరని ప్రభుత్వ ఖాజీని టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, ముస్లిం నేత అత్తుభాయ్ తదితరులు ప్రశ్నించారు. రంజాన్ శుభాకాంక్షలు తెలిపేందుకు మైక్ ఇవ్వాలని కోరారు. మైకును ఇచ్చేది లేదంటూ వైసీపీ నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున అరవడంతో ఉద్రిక్తత నెలకొంది, ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. దీంతో ఖాజీ తన నెక్ మైక్‌ను గురజాల జగన్మోహన్‌కు ఇవ్వగా.. ఆయన మాట్లాడే ప్రయత్నం చేయగానే వైసీపీ అల్లరిమూకలు మైక్‌సౌండ్ వినిపించకుండా స్విచాఫ్ చేశారు. దీంతో టీడీపీ తరఫున వచ్చిన నాయకులు ఇలా చేయడం భావ్యం కాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. పవిత్ర రంజాన్ రోజున ముస్లింల మనోభావాలను గౌరవించి తాము వెళ్లిపోతున్నట్లు టీడీపీ నేతలు తెలిపారు. ఇరు వర్గాల వారికి పోలీసులు సర్దిచెప్పారు. మరోవైపు వైసీపీ నేతలు, కార్యకర్తల తీరుపై ముస్లింల నుంచి ఆగ్రహం వ్యక్తమైంది. తాము ఉపవాస దీక్షలు విరమించి.. రంజాన్ ప్రార్థనలు చేసుకుంటున్న వేళ.. రాజకీయ ప్రయోజనాల కోసం అధికార పార్టీ ఇలా వ్యవహరించడం దారుణమని పలువురు పేర్కొన్నారు.

అతివేగానికి ముగ్గురు యువకుల బలి



మృతులు చైతన్య, అజయ్, జగదీష్ (ఫైల్ ఫొటోలు)

తిరుచానూరు/వరదయ్యపాళెం, ఏప్రిల్ 11: అతివేగం కారణంగా జరిగిన రెండు ప్రమాదాల్లో ముగ్గురు యువకుల నిండు ప్రాణాలు గాలిలో కలసిపోయాయి. తిరుచానూరు ఎస్‌ఐ జగన్నాథ రెడ్డి కథనం ప్రకారం.... నెల్లూరుకు చెందిన చైతన్య(18) ఐటీఐ పూర్తి చేసి శ్రీకాళహస్తి సమీపంలోని ఓ పరిశ్రమలో అప్రెంటీస్ చేసేవాడు. తిరుచానూరు సమీపంలోని దామినేడు హౌసింగ్‌కాలనీలో గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. గురువారం వేకువజామున దామినేడుకు చెందిన అజయ్(17)తో కలిసి మోటార్ సైకిల్‌పై తిరుపతిలోని లక్ష్మీపురం సర్కిల్‌కు వెళ్లాడు.మరో స్కూటర్‌పై స్థానికంగా ఉన్న వీరి స్నేహితులు భాస్కర్, సందీప్ కూడా టీ తాగడానికి లక్ష్మీపురం సర్కిల్‌కు వచ్చారు. నలుగురూ టీ తాగాక చైతన్య, అజయ్ తిరిగి దామినేడుకు బయలుదేరారు. ఫ్లై ఓవర్ ముగిసే స్థలం వద్ద ఓ కల్యాణ మండపం గేటును వీరు ప్రయాణిస్తున్న స్కూటర్ అతివేగంగా ఢీకొంది.దీంతో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. వెనుకే వచ్చిన భాస్కర్, సందీప్ వెంటనే 108అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించారు.అంబులెన్స్ సకాలంలో రాకపోవడంతో ఆటోలో ఆస్పత్రికి తరలించారు. చైతన్య మార్గమధ్యంలోనే మృతి చెందగా అజయ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు.కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాలను రుయా మార్చురీకి తరలించారు. శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించాక శవాలను బంధువులకు అప్పగించనున్నారు. అజయ్ ఇటీవల పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్ష రాశాడు. వీరి మృతితో రెండు కుటుంబాలూ విషాదంలో మునిగిపోయాయి. కాగా వరదయ్యపాళెం మండలం చిన్నపాండూరుకు చెందిన జగదీష్ (28) గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. శ్రీసిటీ ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం మేరకు...చిన్నపాండూరు సమీపంలోని ఏజీఎల్ పరిశ్రమలో పనిచేస్తున్న జగదీష్ గురువారం మధ్యాహ్నం 3గంటలకు బైక్‌లో ఇంటికి వస్తుండగా రాచపాళెం మలుపు కోనాక్షమ్మ ఆలయ సమీపంలో బస్సును ఓవర్ టేక్ చేయబోయి అదుపు తప్పి కింద పడిపోయాడు. అక్కడికక్కడే జగదీష్ మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసులు సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.జగదీష్ మృతి విషయం తెలిసి 8 నెలల గర్భవతి అయిన ఆయన భార్య దిగ్భ్రాంతికి గురైంది. ఎస్‌ఐ శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమలలో గీతాంజలి



అచ్చ తెలుగు హీరోయిన్ అంజలి తాను నటించిన 'గీతాంజలి మళ్లీ వచ్చింది' చిత్రం విడుదల సందర్భంగా గురువారం తిరుమల వెంకన్నను దర్శించుకున్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

రాష్ట్రానికి త్వరలో స్వర్ణయుగం: పాశం



తిన్నెలపూడి రోడ్‌షోలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

కోట, ఏప్రిల్ 11: రాష్ట్రానికి మరో కొద్దిరోజుల్లో స్వర్ణయుగం రానున్నదని గూడూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని తిన్నెలపూడి, తిమ్మనాయుడుపాళెం, వెంకన్నపాళెం గ్రామాల్లో గురువారం టీడీపీ ఎన్నికల ప్రచారం జరిగింది. తెలుగు మహిళ జిల్లా ఉపాధ్యక్షురాలు గండవరం సుష్మారెడ్డి, పురిణి శ్రీనివాసులు, టీడీపీ కార్యదర్శి మారంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మర్రి నాగభూషణం, వెంకనపాళెం సర్పంచు మధు యాదవ్ ఆధ్వర్యంలో పాశం సునీల్‌కుమార్‌కు పూలతో స్వాగతం పలికి, గుమ్మడికాయలు కొట్టి హరతులు పట్టారు. ఆయా గ్రామాల్లో జరిగిన రోడ్ షోలో ఆయన మాట్లాడుతూ.... ప్రస్తుతం రాష్ట్రం అంధకారంలో ఉందని, చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే స్వర్ణాంధ్రగా మారుతుందని చెప్పారు. త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్వోత్తమరెడ్డి, జలీల్ అహ్మద్, తీగల సురేష్‌బాబు, వాకా విజయభాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రజనమ్మ, పలగాటి భాస్కర్‌రెడ్డి, కోటేశ్వరప్రసాద్, పోలయ్య, అనిల్, రాధాకృష్ణారెడ్డి, శ్రీహరి, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోనే బీసీలకు సముచిత స్థానం



సమావేశంలో మాట్లాడుతున్న కందమూడి శివకుమార్

పెళ్లకూరు, ఏప్రిల్ 11: టీడీపీలోనే బీసీలకు సముచిత స్థానం లభిస్తుందని ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని తాళ్వాయిపాడు గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య అధ్యక్షతన జయహో బీసీ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ నాటి ఎన్టీఆర్ నుంచి చంద్రబాబునాయుడు వరకు బీసీలకు తగిన గుర్తింపు ఇచ్చారని అన్నారు. బీసీల అభ్యున్నతికి పాటుపడే టీడీపీకి మద్దతు పలకాలని కోరారు. బీసీ సెల్ మండల అధ్యక్షుడు గంగాబత్తిన రామకృష్ణ మాట్లాడుతూ బీసీల అభివృద్ధికి ఎన్టీఆర్ చూపిన మార్గంలోనే చంద్రబాబు పయనిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పేరం రమేష్‌నాయుడు, పేరం మధుసూదన్‌నాయుడు, దామెర ప్రసాద్‌నాయుడు, కేవీ నాయుడు, ఆరూరు రమణయ్య, గంగాబత్తిన శ్రీనివాసులు, పాలచ్చూరు సుబ్బరామయ్య, మస్తాన్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, సిద్దులయ్య నాయుడు, తాళ్ల యుగందర్, కిలారి గోపీ, బాలయ్య, భాస్కర్, చలపతి, సుధాకర్‌రెడ్డి, గంగాబత్తిన గురవయ్య, ఐటీడీపీ నాయకులు జడపల్లి వెంకటేశ్వర్లు, బడికాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్



గూడూరులోని నమాజ్‌కట్ట వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

గూడూరు, ఏప్రిల్ 11: రంజాన్ పండుగను పట్టణంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో గురువారం జరుపుకున్నారు. స్థానిక నమాజు కట్ట, పెద్దమసీదు, షాదీ మంజిల్ ప్రాంతాల్లో ముస్లిం మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని ఈద్‌ముబారక్ తెలియజేసుకున్నారు. అదే విధంగా చిన్నమసీదు, రాణిపేట, ఇందిరానగర్, గాంధీనగర్, వీరారెడ్డిపల్లి, బనిగిసాహెబ్‌పేట, మండల పరిధిలోని పోటుపాళెం, విందూరు, చెన్నూరు, తిప్పవరప్పాడు ప్రాంతాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ప్రార్థనల్లో పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

చిల్లకూరు: మండలంలోని చిల్లకూరు, మోమిడి, పారిచెర్లవారిపాళెం, వుడుతావారిపాళెం, తొణుకుమాల, ఏరూరు, కడివేడు తదితర గ్రామాల్లోని ముస్లింలు రంజాన్ పండుగను జరుపుకున్నారు. మసీదుల్లో నమాజ్ చేశారు. ఒకరికొకరు అలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

సూళ్లూరుపేట: పట్టణంతో పాటు గ్రామాల్లో ముస్లింలు సోదరులు గురువారం రంజాన్ పండగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాలు, మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పండగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

చిట్టమూరు: మండలంలో పలు గ్రామాల్లో ముస్లిం రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదుల్లో ప్రార్థనలు నిర్వహించుకున్నారు. కోగిలి, చిట్టమూరు, మల్లాం, యల్లసిరి, తదితర గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

తడ: మండలంలోని పూడికుప్పం, బీమిలివారిపాళెం వద్ద ఉన్న ప్రార్థనా స్థలాలల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని జామియా మసీదు, ఈద్గా దర్గా, ప్రాంతాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థలు చేశారు.

కోట: మండల పరిధిలోని కోట, చిట్టేడు, విద్యానగర్, నెల్లూరుపల్లి కొత్తపాళెం, గోవిందపల్లి గ్రామాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఓజిలి: మండలంలోని ఓజిలితో పాటు కురుగొండ, రాజుపాళెం, కర్రబల్లవోలు, అర్మేనిపాడు, సగుటూరు, మనవాలి, కాచిమేడు తదితర గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఎన్నికల వేళ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఆర్టీసీ బస్టాండు వద్ద స్థానికులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ రహీం రెడ్డి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 11: ఎన్నికల వేళ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ రహీం రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని రద్దీ ప్రాంతాలైన ఆర్టీసీ బస్టాండు, షార్ బై జంక్షన్, షార్ బస్టాండు తదితర ప్రాంతాల్లో ప్రజలతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు, ఇక్కడ నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాహనాలు, మోటారు సైకిళ్లపై వెళ్లే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు లిఫ్ట్ అడిగితే వారి వివరాలు తెలుసుకొని ఎక్కించుకోవాలన్నారు. కొందరు అక్రమ నగదు, మద్యం వంటివి బ్యాగుల్లో పెట్టుకుని తరలిస్తూ లిఫ్ట్ అడుగుతారని, అటువంటి వారిని వాహనాల్లో ఎక్కించుకోకూడదని సూచించారు.

కోడ్ ఉల్లంఘన జరగరాదు: జేసీ

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 11: గ్రామ, వార్డు స్థాయిలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరగరాదని జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం సార్వత్రిక ఎన్నికలపై జిల్లా అధికారులతో జేసీ టెలీకాన్ఫరెన్సు నిర్వహించారు. గ్రామాల్లో ఇంకా బ్యానర్లు, పోస్టర్లు ఉంటే తొలగించాలని ఆదేశించారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

కోట, ఏప్రిల్ 11: విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి చెందిన ఘటన కోట మండలం విద్యానగర్ గాంధీబొమ్మ సమీపంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు... వాకాడు మండలం సిద్దిగుంటపాళెంకు చెందిన ఫరూక్(22) విద్యానగర్‌లోని ఓ చికెన్ స్టాల్‌లో పని చేస్తున్నారు. గురువారం కోళ్లను బ్రాయిలర్‌లో వేసి శుభ్రం చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు.

త్రివిక్రమ అలంకారంలో బాలాంజనేయస్వామి



సూళ్లూరు పేట, ఏప్రిల్ 11: పట్టణంలోని బాలాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీరామ నవమి వసంతోత్సవాల్లో భాగంగా గురువారం త్రివిక్రమ అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి విశేష పూజలు చేశారు. అదేవిధంగా బ్రాహ్మణ వీధిలోని సీతారాముల దేవస్థానంలో వసంత నవరాత్రుల ఉత్సవాలు జరుగుతున్నాయి. శ్రీరాముడు వరాహమూర్తిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి మూలవిరాట్‌కు పుష్పాలంకరణ చేసి పూజలు చేశారు.





పచ్చారు చేను వద్ద గోతులమయంగా ఉన్న రహదారి - అక్కసముద్రం కల్వర్టు వద్ద రాళ్లు తేలిన రోడ్డు

రోడ్డు విస్తరణ పూర్తయ్యేదెన్నడో?

రాళ్లు తేలిన రోడ్డు ● దుమ్ము, రాళ్లలో నరకంగా మారిన ప్రయాణం ● ప్రజలకు తప్పని తిప్పలు

బాలాయపల్లి, ఏప్రిల్, 11: గూడూరు - వెంకటగిరి రోడ్డు విస్తరణ పనులు ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. రెండేళ్ల కిందట రూ.40 కోట్లతో విస్తరణ పనులు చేపట్టేందుకు ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. బాలాయపల్లి నుంచి నిండలి రోడ్డు వరకు తారురోడ్డు నిర్మాణం, వెంగమాంబపురం, మాటుమడుగు, అంబలపూడి గ్రామాల వద్ద సిమెంటు రోడ్డు పనులు చేపట్టారు. అదేవిధంగా ఈ మార్గంలో ఉన్న 30 కల్వర్టుల స్థానంలో కొత్తవి నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. అమ్మపాళెం సమీపంలో కొంతదూరం రోడ్డుకి ఇరువైపులా మట్టి తీసి వెట్‌మిక్స్ నెరిపి తారు వేయకుండా వదిలి వేశారు. దీంతో ఈ మార్గంలోని కల్వర్టులు, రోడ్డు విస్తరణ కోసం వెట్ మిక్స్ నెరిపిన చోట రాళ్లు తేలి ప్రయాణం నరకంగా మారింది. అంతేకాకుండా వెంకటగిరి - గూడూరు మార్గంలో ప్రయాణించాలంటే గోతులమయంగా ఉన్న రోడ్లతో నరకం కనిపిస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో ద్విచక్ర వాహనాల్లో ప్రయాణం చేయాలన్నా ఎక్కడ ఏ గోతిలో పడి ప్రమాదం సంభవిస్తుందోనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిండలి రోడ్డు సమీపాన ఉన్న నేరేడు కాలువ వంతెన లోలెవల్ నుంచి హైలెవల్ పెంచేందుకు రూ.4.75 కోట్లతో పనులు చేపట్టేందుకు డైవర్షన్ ఏర్పాటు చేశారు. ఆ తరువాత వంతెన పనులు చేపట్టకుండా ఆపేశారు. దీంతో వాహనదారులు ప్రమాదకరంగా ఉన్న వంతెన మీదనే ప్రయాణాలు సాగిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు, పక్కన ఎమ్మెల్యే అభ్యర్థులు విజయశ్రీ, సుధీర్‌రెడ్డి

జగన్ అహంకారి: వరప్రసాదరావు

నాయుడుపేట/సూళ్లూరుపేట, ఏప్రిల్ 11: వైసీపీ అధినేత జగన్ అహంకారభావంతో వ్యవహరిస్తూ దళితులను అవమానపరుస్తున్నారని, అది తట్టుకోలేక పార్టీని వీడానని బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు తెలిపారు. గురువారం నాయుడుపేటలోని శ్రీనివాస కల్యాణ మండపంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల డాక్టర్ విజయశ్రీ పరిచయ కార్యక్రమం, కూటమి నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరప్రసాదరావు మాట్లాడుతూ ప్రత్యేక హోదా కోసం జగన్ ఆదేశించిన వెంటనే తాను ఎంపీ పదవికి రాజీనామా చేశానని, ఆ కృతజ్ఞత కూడా చూపించకుండా 2019లో తనను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించినా ఆయనపై గౌరవంతో పోటీ చేసి గెలిచానన్నారు. అప్పటి నుంచి ఎన్నో అవమానాల పాలయ్యానని, సహించలేక ఆ పార్టీ నుంచి బయటకు వచ్చి బీజేపీలో చేరానన్నారు. 23మంది దళిత ఎమ్మెల్యేలకు రెండోసారి టికెట్లు కేటాయించకుండా జగన్ కర్కశంగా వ్యవహరించారని విమర్శించారు. దేశానికి ప్రధాని మోదీ నాయకత్వం ఎంతో అవసరమన్నారు. తన పనితీరును గుర్తించిన బీజేపీ తిరుపతి ఎంపీ టికెట్‌ను కేటాయించిందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సమన్వయంతో పని చేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి, టీడీపీ ఎన్నికల పరిశీలకుడు దీపక్‌రెడ్డి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోపీ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప, ఏఎంసీ మాజీ ఛైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, జనసేన నాయకులు ఉయ్యాల ప్రవీణ్, బీజేపీ నాయకులు జంపాల మాల్యాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు టీడీపీ నాయకుడు రఫీ నివాసాని వెళ్లిన వరప్రసాదరావు ముస్లిం మైనారిటీ నాయకులతో సమావేశమయ్యారు. అలాగే సూళ్లూరుపేటలోని బీజేపీ నేత వంకా రామాంజనేయులు ఆధ్వర్యంలో నాయకులు ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావును కలిసి ప్రచారం నిర్వహించాలని కోరారు.

వెంకటగిరిని అభివృద్ధి పథంలో నడిపిస్తా: లక్ష్మీసాయిప్రియ



రచ్చబండలో మాట్లాడుతున్న లక్ష్మీసాయిప్రియ

వెంకటగిరి, ఏప్రిల్ 11: వెంకటగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ అన్నారు. గురువారం ఆమె వెంకటగిరి మండలం సిద్ధవరం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టోను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. అనంతరం గ్రామంలో రచ్చబండ నిర్వహించి స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెనుకబడ్డ వెంకటగిరిని ముందుకు నడిపించడానికి ప్రణాళికబద్ధంగా కృషి చేస్తానని చెప్పారు. బెల్ కర్మాగారాన్ని మన్నవరం ప్రాంతానికి వచ్చేలా కృషి చేస్తామని, తద్వారా వందలాది చిన్నతరహ పరిశ్రమలు యువతకు ఉపాధి అవకాలు లభిస్తాయన్నారు. రచ్చబండలో తెలుసుకొన్న సమస్యలను అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని హామీ అచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరావు, మండల అధ్యక్షుడు పప్పు చంద్రమౌళిరెడ్డి, అవ్వారు సత్యనారాయణ, మునిరత్నం, వెంకటేశ్వర్లు, శివనారాయణ, ఆవుల మురళి, కోటి, పెంచలయ్య, చంగలరాయుడు, ముద్దా మురళి, బాబు నాయుడు, నక్కా వెంకటేశ్వర్లు, కేవీఆర్, మగ్గం వెంకటేశ్వర్లు, చలపతి, జనసేన నాయకులు రాధమ్మ, స్వప్న, రేవతి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం



నిడిగల్లులో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

బాలాయపల్లి, ఏప్రిల్ 11: చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధితో పాటు సంక్షేమం సాధ్యమవుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు అన్నారు. గురువారం మండలంలోని నిడిగల్లు పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి, చాకలపల్లి, గాజులపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీసాయిప్రియ, బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాయి సత్యం నాయుడు, కూను శ్రీహరి, దాసరి రాజగోపాల్ నాయుడు, దాసరి ప్రభాకర్ నాయుడు, ఆదిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి, కొర్రపాటి రామచంద్ర నాయుడు, మారెళ్ల వెంకటాద్రి, కోటేశ్వరావు, దంపెళ్ల అంజయ్య, పులకంటి మురళి, రమేష్ నాయుడు, జనార్దనరెడ్డి, శేఖర్ నాయుడు, పెంచలయ్య, మదుయాదవ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు పుట్టినిల్లు టీడీపీ: నెలవల



గ్రద్దగుంటలోని గ్రామదేవత ఆలయంలో పూజలు చేస్తున్న విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం

ఓజిలి, ఏప్రిల్ 11: తెలుగుదేశం పార్టీ సంక్షేమ పథకాలకు పుట్టినిల్లు అని సూళ్లూరుపేట ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. ఓజిలి మండలం గ్రద్దగుంట పంచాయతీలో ఆ పార్టీ మండల కన్వీనర్ గుజలపూడి విజయ్‌కుమార్‌నాయుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థిని విజయశ్రీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత గ్రామదేవతకు పూజలు చేశారు. అనంతరం పంచాయతీ పరిధిలోని గ్రద్దగుంట, గొల్లపాళెం, పాపిరెడ్డికండ్రిగ, శ్రీనివాసపురం, జోష్యులవారికండ్రిగ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ బడుగు, బలహీన వర్గాలకు వెన్నెముకగా నిలిచిందని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పెద్దఎత్తున ప్రజల్లోకి తీసుకువెళ్లి వారి స్థితిగతులను మార్చిన ఏకైక పార్టీ టీడీపీయేనని కొనియాడారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో చిన్నాభిన్నం అయిపోయిందని, దోపిడీ, దాడులు రాజ్యమేలుతూ అభివృద్ధి మచ్చుకైనా కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవడం మనందరి తక్షణ కర్తవ్యమని నెలవల అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్, క్లస్టర్ ఇన్‌చార్జి కంకణాల సత్యవరప్రసాద్‌రావు, నెలవల రాజేష్, శ్రీనివాసులు, పుల్లయ్య, మధుసూదన్‌యాదవ్ పాల్గొన్నారు.

జ్యోతిరావ్‌పూలేను ఆదర్శంగా తీసుకోవాలి



జ్యోతిరావ్‌పూలే దంపతుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నేతలు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 11: జ్యోతిరావ్‌పూలేను ఆదర్శంగా తీసుకోవాలని విగ్రహాల నిర్వహణ కమిటీ సభ్యులు అన్నారు. గురువారం స్థానిక ఆర్‌అండ్‌బీ కార్యాలయం సమీపంలో ఉన్న మహనీయుల విగ్రహాల ప్రాంగణంలోని జ్యోతిరావ్‌పూలే దంపతుల విగ్రహాలకు ప్రజాసంఘాల నాయకులు నివాళులర్పించారు. నాశిన భాస్కర్‌గౌడ్, అరవ పార్వతయ్య, శరత్‌యాదవ్, ప్రభాకర్, కృష్ణ, శివకుమార్, మణి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోట: పట్టణంలోని బీసీ బాలుర గురుకులంలో జోతీరావ్‌పూలే చిత్రపటానికి గురుకులాల జిల్లా కన్వీనర్ నారాయణరావు నివాళులర్పించారు. అదేవిధంగా విద్యానగర్‌లోని బీసీ బాలికల గురుకులంలో ప్రిన్స్‌పాల్ అంజనమ్మ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు జోతీరావ్‌పూలే చిత్రపటానికి నివాళులర్పించారు.

నాయుడుపేట: పట్టణంలో నిర్వహించిన జ్యోతిరావుపూలే జయంతి వేడుకల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ, సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఏఎంసీ ఛైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి, నెలవల రాజేష్, మొడాం బాబు, ధనంజయ, పరసా రాజా, జువ్వలపాటి మస్తాన్, గుంటూరు లక్ష్మయ్య, పసల గంగాప్రసాద్, లోకనాథం, అత్తికాయల సుబ్రహ్మణ్యం, సులేమాన్, సుబ్బరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.53 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.53 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి గురువారం ప్రకటించింది.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

బాలాయపల్లి, ఏప్రిల్ 11: బాలాయపల్లి పంచాయతీకి చెందిన వైసీపీ నాయకులు లెక్కల రాజీవ్ కృష్ణ, తాళ్లూరు సుబ్రహ్మణ్యం నాయుడుతో పాటు వలంటీర్లు తాళ్లూరు ఉమ, లెక్కల సుజన, చింతల శివ సంధ్య గురువారం టీడీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా యువతను పెడదోవ పట్టించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఇరవై లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, రాయి సత్యం నాయుడు, తాళ్లూరు ప్రసాద్ నాయుడు, బొల్లినేని వెంకటకృష్ణమ నాయుడు, అంకమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీసాయిప్రియను గెలిపించండి



ఓట్లు అభ్యర్థిస్తున్న మాజీ ఎమ్మెల్యే కురుగుగొండ్ల

వెంకటగిరి, ఏప్రిల్ 11: పట్టణంలోని 13వ వార్డులో మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పర్యటించారు. తన కుమార్తె లక్ష్మీసాయిప్రియను గెలిపించాలని కోరారు. ఆయన వెంట పులికొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, బీరం రాజేశ్వరరావు, కాపా శ్రీనివాసులు నాయుడు, కైశ్యలమ్మ, అవ్వారు సత్యనారాయణ, మల్లారం బాబు, గల్లా శ్రీనివాసులు, మంకు ఆనంద్ వున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 11: మండల పరిధిలోని తోటకట్ల గ్రామంలో సోలా గోపీకి చెందిన ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. స్థానికుల సమాచారం మేరకు... గోపి కుటుంబ సభ్యులతో ఇంట్లో కలిసి నిద్రిస్తుండగా బుధవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌కు గురికావడంతో మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన గోపీ కుటుంబసభ్యులు బయటకు వచ్చి ప్రాణాలను రక్షించుకొన్నారు. ఇంట్లోని గృహోపకరణాలు, బంగారు ఆభరణాలు, చేపల వేట వలలు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.3 లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. విషయం తెలుసుకొన్న టీడీపీ మండల అధ్యక్షుడు కొక్కు శంకరయ్య, సర్పంచు గొంజి వెంకటేశ్వర్లు, తిరుపాల్ బాధితులను గురువారం పరామర్శించారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాయం అందేలా న్యాయం చేస్తామని చెప్పారు.

అండమాన్‌లోనూ కూటమిదే విజయం: టీడీపీ



అండమాన్ నికోబార్ దీవుల ప్రచార సభలో జేపీ నడ్డా, మాధవనాయుడు

డక్కిలి, ఏప్రిల్ 11: అండమాన్ నికోబార్ దీవుల్లోనూ టీడీపీ, బీజేపీ కూటమిదే విజయమని టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాధవనాయుడు అన్నారు. గురువారం ఆయన అండమాన్ నుంచి ఫోన్‌లో మీడియాతో మాట్లాడుతూ కూటమి అభ్యర్థి విజయానికి బీజేపీ సీనియర్ నేత నడ్డా గురువారం ఎన్నికల ప్రచారం ప్రారంభించినట్లు తెలిపారు. అండమాన్ నుంచి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా బిష్ణుపదరాయల్ పోటీ చేస్తున్నట్లు తెలిపారు. కాగా, పోర్ట్‌బ్లెయిర్ మున్సిపల్ ఛైర్మన్‌గా బీజేపీ, టీడీపీ ఉమ్మడి అభ్యర్థే విజయం సాధించినట్లు వివరించారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి



కవాతు నిర్వహిస్తున్న పోలీస్, పారామిలటరీ సిబ్బంది

చిల్లకూరు, ఏప్రిల్ 11: ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని సీఐ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వరగలి, మోమిడి, లింగవరం గ్రామాలలో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ పోలీస్, పారామిలటరీ సిబ్బంది కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఎవరైనా ఓటర్లను భయాందోళనకు గురి చేసినా, ప్రలోభాలకు గురి చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు పోలీసులు రక్షణగా నిలుస్తారన్నారు. నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అంజిరెడ్డి, పోలీస్, పారామిలటరీ సిబ్బంది పాల్గొన్నారు.

బాబు వస్తేనే... జాబు వస్తుంది



లక్ష్మక్కకండ్రిగలో ఎన్‌ఆర్‌ఐల ప్రచారం

కోట, ఏప్రిల్ 11: రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలన్నా, ప్రతి ఇంటికీ జాబ్ రావాలన్నా చంద్రబాబు నాయుడిని సీఎంగా చేసుకోవాలని ఎన్‌ఆర్‌ఐలు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని లక్ష్మక్కకండ్రిగ, చంబడిపాళెం, తూర్పుకండ్రిగ గ్రామాల్లో గురువారం ఎన్‌ఆర్‌ఐలు స్వరూప, శారద, సునీత, సరస్వతి, విజయ, సుమీత, సురేఖ, ప్రసన్న ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అభివృద్ధిలో వెనుకబడిపోయిన ఆంధ్రాకు మంచి రోజులు రావాలంటే చంద్రబాబును సీఎం రావాలన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో గూడూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్‌ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.